Rs. 12/- per copy

UESI
ANDHRA PRADESH

# విద్యార్థి జ్వాల

Vol. 30 - No.2
December 2023



## క్రిస్మస్‌లో త్యాగం






# మీకు సమాధానము కలుగును గాక!

సర్వోన్నతమైన స్థలములలో దేవునికి మహిమయు ఆయనకిష్టులైన మనుష్యులకు
భూమిమీద సమాధానమును కలుగును గాక! - లూకా 2:14

ఒకసారి యుద్ధం ప్రారంభమైతే అది ఎప్పుడు ముగుస్తుందో ఎవరికీ తెలియదు. 20 నెలలుగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధమే అందుకు ఉదాహరణ. ఇదిలా ఉంటే 40 రోజుల క్రితం ప్రారంభమైన ఇజ్రాయేల్-హమాస్ పోరాటం కూడా అదే తరహాలో సాగుతోంది. హమాస్‌ను అంతం చేయడమే లక్ష్యంగా ఇజ్రాయేల్ గాజా నలువైపుల నుండి దాడులను రోజురోజుకూ తీవ్రతరం చేస్తోంది. ఈ దాడులను హమాస్ కూడా అంతే తీవ్రంగా ప్రతిఘటిస్తోంది. ఈ దాడుల్లో మహిళలు, చిన్నారులతో సహా సుమారు 13వేల మంది పాలస్తీనీయులు, 12వందల మంది ఇశ్రాయేలీలు ప్రాణాలు కోల్పోగా, అంతకు మించి క్షతగాత్రులయ్యారు. గాజాలో బాంబుల శబ్దాలతో మహిళలకు గర్భస్రావాలు, పెయిన్ కిల్లర్స్ లేకుండానే ప్రసవాలు, 'నిండు గర్భిణీలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పరిగెత్తుతూ పారిపోవడం, ఇక పిల్లలు, పెద్దలు, వృద్ధులు ఇలా అందరి బాధ, వేదన వర్ణనాతీతం. ఎక్కడ చూసినా సమాధానం, నెమ్మది లేని పరిస్థితులే.

1870-71వ సంవత్సరంలో ఫ్రాన్స్, జర్మనీ దేశాల మధ్య 6 నెలలుగా ఫ్రాంకో-ప్రష్యన్ యుద్ధం జరుగుచున్న సమయంలో కూడా దాదాపు ఇలాంటి పరిస్థితులే. అయితే ఊహించని విధంగా వారి మధ్య శాంతి, సమాధానం, నెమ్మది ఏర్పడడానికి ఒక క్రిస్మస్ గీతం కారణమైంది. క్రిస్మస్ ముందు రోజు సాయంత్రం ఇరుపక్షాల సైన్యాలు వారి వారి స్థలాల్లో యుద్ధానికి సన్నద్ధులై ఉన్నారు. ఆ సమయంలో, ఒక ఫ్రెంచ్ సైనికుడు పైకి ఎగురుతూ ఒక్కసారిగా 'ఓ హోలీ నైట్' (శుద్ధరాత్రి) అనే పాట పాడడం ప్రారంభించాడు. ఆ చర్య జర్మన్ సైనికుల్ని ఆశ్చర్యపరచింది. వారిలో ఎవ్వరూ ఇతనిని తుపాకితో కాల్చలేదు. కొంత సేపటికి జర్మన్ సైనికుల్లో కూడా ఒకరు ముందుకు వచ్చి ఆ పాటలోని తర్వాతి చరణాన్ని పాడాడు. ఒకరినొకరు చంపుకోవడానికి అక్కడ చేరిన సైనికుల మధ్య 'భూమి మీద సమాధానం' రాజ్యమేలింది. ఈ పాటలోని మాటలు లోకంలోని కీడును అంతం చేసే దేవుని ప్రేమను, శాంతిని చూపిస్తాయి. యుద్ధ ఫలితాలైన చంపడం, చావడాలను ఎదుర్కొంటున్న సైనికులకంటే ఈ లోకపు కీడు మరెవరికి బాగా అర్థమవుతుంది? అటువంటి గొప్ప కీడును వారు ప్రేమ, సమాధానాలకు మూలమైన క్రీస్తును జ్ఞాపకం చేసుకోవడం ద్వారా జయించారు.

విశ్వాసులంగా మనం భౌతికమైన యుద్ధాల్లో పాల్గొనక పోయినా అప్పుడప్పుడు సంఘంలో, సహవాసంలో, ఇంటిలో, పనిచేసే ప్రాంతంలో ఏదో ఒక రూపంలో పోరాటాల్ని ఎదుర్కొంటూనే ఉంటాం. తిరస్కారానికి, అవమానానికి గురవ్వడం, మాటలు, క్రియలతో గాయపడిన, నొప్పి కలిగించిన సంఘటలను ఎదుర్కొంటూనే ఉంటాం. ఫలితంగా వ్యక్తిగతంగా, సహవాసంగా సమాధానం, నెమ్మది లేని పరిస్థితులు నెలకొంటున్నాయి. కొన్నిసార్లు అవి తీవ్రమై మనకు దేవుని ప్రేమ, క్షమా, సమాధానం, ఆయన మనసు ఏమాత్రం జ్ఞాపకానికి రాకుండా చేస్తాయి. అలాంటి సమయాల్లో మనకు అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. అన్యాయాన్ని, అవమానాన్ని ఎందుకు భరించాలి? వీటికి కారణమైన వారిని ఎందుకు క్షమించాలని? మాట, క్రియ ద్వారా ప్రతీకారం తీర్చుకోవడానికి సమయం కోసం కనిపెడుతూ ఉంటాము. మనలోని ప్రాచీన స్వభావం లేదా అహం పైకిలేచి క్రీస్తు మాదిరిని అనుసరించి క్షమించడానికి ముందుకు రాదు. రోజులు, నెలలు, సంవత్సరాలు అలానే గడుపుతూ ఉంటాం. అప్పుడు మనసు ఒక రణరంగంలా ఉంటుంది. తద్వారా దేవుడు అనుగ్రహించే శాంతి, సమాధానాల్ని కోల్పోవడం జరుగుతుంది.

దేవుడు తన సమాధానాన్ని మనకివ్వడానికి తన కుమారుణ్ణి మనకనుగ్రహించాడు. ఆయనకు సమాధాన కర్తయగు అధిపతి అని పేరు (యెషయా 9:6) పెట్టబడింది. ఆ కుమారునియందు విశ్వాసముంచడం ద్వారా మనకు ఆయనతో సంబంధం ఏర్పడింది. ఆ సమాధాన కర్త మన జీవితాల్లో ఉన్నా సమాధానం లేని సమయాలు ఎన్నో ఉంటున్నాయి. ఎందుకని? సంబంధం ఉంటే సరిపోదు, ఆయనతో సహవాసంలో సన్నిహితంగా ఎదగకపోవడం ద్వారానే. పరిస్థితులు ఎలా ఉన్నా ఆ సహవాసంలో ఎంతగా ఎదుగుతామో అంత సమాధానాన్ని, నెమ్మదిని మన హృదయంలో కలిగి ఉంటాము. అలాగే ఇతరులతో సమాధానం కలిగి, సమాధానానికి కారకులుగా ఉంటాము. "క్రీస్తు అనుగ్రహించు సమాధానము మీ హృదయములలో ఏలుచుండనియ్యుడి; ఇందుకొరకే మీరొక్క శరీరంగా పిలువబడితిరి" (కొలస్సీ 3:15) అని అపొస్తలుడైన పౌలు చెబుతాడు. గనుక మన చింతలు, ఆదుర్దా ఆయనకు అప్పగించి వాటి స్థానంలో క్రీస్తు అనుగ్రహించు సమాధానము మన హృదయంలో, తలంపుల్లో అనుభవిద్దాం.

నేటి మన సమాజం జాతి, కుల, మత, భాషా, ప్రాంతీయ విద్వేషాలతో, కలుషితమైన రాజకీయాలతో, స్వార్థంతో నిండి, సమాధానం లేని పరిస్థితులలో ఉంది. సమాజంలో నిజమైన శాంతి, సమాధానాలు కావాలంటే వ్యక్తులు, చట్టాలు, రాజకీయాలు, సైనికుల ద్వారా సాధ్యం కాదు. కేవలం యేసుక్రీస్తు ద్వారా, ఆయనయందు విశ్వాసముంచుట ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది.

"ఆయనతో సహవాసము చేసిన యెడల నీకు
సమాధానము...మేలు కలుగును" - యోబు 22:21

- పి. సునీల్ జాకబ్

# విద్యార్థి జ్వాల



Vol. 30, No. 2 December 2023
A Publication of
UESI Publication Trust



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.



CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com



GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Year) - Rs. 400
GRADUATES (3 Year) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years) Rs. 2000/-
OVERSEAS (10 Years) - Rs. 2000/-

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

January 2024: Newness
February: "Knowing...Growing....Serving"

**Note:** Please send your writeups on or before
**10th of every month**




# శరీరధారణ మనకు ఆశ్చర్యమే!

యేసుక్రీస్తు శరీరధారణ మనల్ని విస్మయానికి లేదా ఆశ్చర్యానికి గురి చేయాలి. ఎందుకంటే....

ఒకే వ్యక్తి మహిమను, దు:ఖాన్ని కలిగి ఉండడం,

దైవత్వములో అనంతమైన ఆనందం, మానవత్వములో చెప్పుజాలని బాధ కలిగి ఉండడం,

సింహాసనముపై ఉన్న దేవుడు ఊయలలో శిశువుగా ఉండడం,

గర్జించే, ఉరిమే సృష్టి కర్త ఏడుస్తున్న పసికందుగా, బాధింపడే లేదా హింసింపబడే మనిషిగా ఉండడమే.

క్రీస్తు యొక్క శరీరధారణ భూమి మీద ఉన్న మనుష్యులను, పరలోకములో ఉన్న దేవదూతలను ఆశ్చర్యపరుస్తుంది. ఆ దైవికజ్ఞానము ముందు మన శిరస్సు వంచి సాగిలపడడం, హృదయాన్ని సంపూర్ణంగా ఆయనకు సమర్పించడం, ఆరాధించడం తప్ప ఏం చేయగలం!

## లోపలి పేజీల్లో...


- మీకు సమాధాము కలుగును గాక! - 2
- బెటర్ లేట్ దేన్ నెవర్ - 4
- క్రిస్మస్‌లో త్యాగం - 5
- శరీరధారణ ఎందుకు? - 8
- క్రీస్తు కన్యకకు జన్మించడం? - 11
- క్రీస్తు మనసు - సహవాసంలో ఐక్యత - 14
- సంఘ సంస్కర్త మార్టిన్ లూథర్ - 15
- ఎవని సంబంధులం? - 18
- సంబంధాలు - 20
- హార్డ్ వర్క్ @ కెరీర్ - 23
- రిస్క్ తీసుకోవాలి - 26
- నీవు ప్రేమ గలవాడివే - 29
- నేను కష్టాల్ని...- 29
- క్షమాపణ - 30
- సర్వోన్నతుడు సశరీరుడయ్యే - 31
- ఈయన ఎవరో? - 32

# బెటర్ లేట్ దేన్ నెవర్

ఎంత త్వరగా 2023వ సంవత్సరం అయిపోతుందో అనిపిస్తుంది కదా!

సంవత్సర ప్రారంభంలో ఎన్నో కొత్త నిర్ణయాలు, ఆశలు, ప్రణాళికలు, లక్ష్యాలు, వాగ్దానాలు (దేవునికి మనం, దేవుని నుంచి మనకు) అవి నెరవేరడంతో సంబంధం లేకుండా మనం చివరి నెలకు వచ్చేశాం. మన నిర్ణయాలు కార్యరూపం దాల్చాయా? మన ఆశలు నెరవేరాయా? మన ప్రణాళికలు ప్రయోగాత్మకంగా మారాయా? లక్ష్యాలు ఎంతవరకు సాధించాం? వాగ్దానాల విషయంలో మన పరిస్థితి ఏంటి? అనే విషయాలు ఆలోచించి, స్వీయ పరీక్ష చేసుకోవడం మంచిదేమో.



దేవునికి, ఆయన ప్రజలకు మన జీవితాలు ఎంతవరకు అందుబాటులో ఉన్నాయి? ఆయన వాక్యం శ్రద్ధగా, క్రమంగా చదువుతూ ధ్యానించడం, ఆయన ప్రజల క్షేమం కోసం ప్రార్థించడం అనేవి దేవునికి అందుబాటులో ఉండడం. ఆయన ప్రజలతో కలవడం (1:3; ఇబియస్, బిబియస్, ఇజియఫ్, రిట్రీట్స్, క్యాంప్స్, కాన్ఫరెన్స్‌లు, ఆతిథ్యం) మొదలగు వాటిని ఆయన ప్రజలకు అందుబాటులో ఉండడంగా భావించవచ్చు.

ఏదైనా కారణం చేత ఆయన ఆశించిన అంతరంగ మార్పును సాధించకపోయినా, ఆయన ఆశించిన విధంగా జీవితాన్ని మార్గదర్శకంగా మార్చుకోకపోయినా, ఆయన మనసును, మమకారాన్ని మనుష్యులకు చూపకపోయినా ఇదే అనుకూల సమయం. ఈ చివరి నెలనైనా సద్వినియోగం చేసుకొని, సంవత్సర ప్రారంభంలో చేసిన నిర్ణయాలను, లక్ష్యాలను, వాగ్దానాలను నెరవేర్చుదాం. సర్వోన్నతుని సహకారంతో సంతోషంగా ఈ సంవత్సరాన్ని ముగిద్దాం. ఎందుకంటే 'బెటర్ లేట్ దేన్ నెవర్' (అసలు చేయకపోవడం కంటే ఆలస్యంగానైనా చేయడం మంచిది).

ఆయన ప్రణాళికలో మీ....

**ఆర్. శ్రీనివాస్**
యుఇయస్ఐ-ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు



# క్రిస్మస్‌లో త్యాగం

క్రిస్మస్ మన జీవితాల్లో సంతోషాన్ని నింపే గొప్ప సంఘటన. జగత్తు పునాది వేయబడకముందే వేసిన దేవుని ప్రణాళిక సాకారం చేయబడిన రోజు. క్రిస్మస్ మనకు నూతన జన్మ అనుగ్రహించే యేసుని జన్మ. ఆయన జన్మ మనకు వరం. యేసు జన్మ వెనుక అనేక త్యాగాలు ఉన్నాయి.

## యేసు త్యాగం

యేసు దేవునితో సమానంగా ఉండే భాగ్యాన్ని విడిచిపెట్టి, దాసుని స్వరూపం ధరించుకొని, తన్నుతాను రిక్తునిగా చేసుకొని సిలువ మీద శాపగ్రస్తమైన మరణం పొందడం ఆయన మన కొరకు చేసిన త్యాగాన్ని తెలియచేస్తుంది (ఫిలిప్పీ 2:1-7).

ధూళిలాంటి, మట్టిలాంటి మన కోసం ఆయన తన ప్రాణం పెట్టాల్సిన అవసరం లేదు. మట్టి పాత్రలమైన మనలో తన మహిమైశ్వర్యము నింపడానికి తన ప్రాణాన్ని త్యాగం చేశాడు. మనలను పట్టించుకోకుండా ఆయన మనలను వదిలివేయవచ్చు గానీ ఆయన మనలను వదిలిపెట్టలేదు. అది ఆయన ప్రేమను తెలియచేస్తుంది. జగత్తు పునాదివేయబడక ముందే ఆయన వధింపబడ్డాడు (ప్రక 13:8; 1 పేతురు 1:20).

మానవుడు అవిధేయత చూపి మరణాన్ని ఎంచుకొంటాడని, నిత్యజీవితం తిరస్కరిస్తాడని తెలిసి కూడా మానవుని సృజించడమనేది దేవుని ప్రేమను తెలియచేస్తుంది. మానవుడిని ఆయన స్వరూపంలో చేసుకొన్నాడు కాబట్టి అంత ప్రేమ. ఆయన మహిమ కోసం సృజించిన వానిని, ఆయనతో సహవాసం చేయడానికి ఉద్దేశించిన మానవుని ఆయన విడిచిపెట్టడు. మనం ధనవంతుల వ్వాలని ఆయన మన కోసం దరిద్రుడయ్యాడు (2 కొరింథీ 8:9).



## యోసేపు త్యాగం

తను చేసుకొనే స్త్రీ పెళ్ళికి ముందే గర్భవతి అని తెలిస్తే ఏ పురుషుడైనా షాక్ తింటాడు. ఎన్నో అనుమానాలు, అసహ్యం, ఆందోళన, కోపం, దు:ఖం, నిరుత్సాహం మొదలైనవి చుట్టు ముడతాయి. ఆయన నీతిమంతుడైయుండి మరియను అవమానపరచనొల్లక రహస్యంగా విడనాడ నుద్దేశించాడు. ఆయనకు ప్రభువు దూత స్వప్నమందు కనబడి మరియను చేర్చుకొనుటకు భయపడవద్దు అనే భరోసా ఇచ్చి, ఇది ప్రవచన నెరవేర్పు అని వివరించి ఆయన మరియను అంగీకరించడానికి సహాయపడింది. కానీ ఈ విషయం అందరికి తెలిసిపోయింది. అందుకే యూదులు యేసును మేము వ్యభిచారము వలన పుట్టినవారం కామని (యోహాను 8:41) ఎద్దేవా చేశారు. యేసుక్రీస్తును (రక్షణను) ఈ లోకానికి తీసుకొనిరావడానికి యోసేపు, సమాజంలో తనకున్న పరువును, మర్యాదను త్యాగం చేయాల్సి వచ్చింది. జారత్వం చేసిన స్త్రీని పెళ్ళాడిన వ్యక్తిగా ముద్ర వేయించుకోవలసి వచ్చింది.

హేరోదు శిశువును చంపుతాడని తెలిసినప్పుడు స్వప్నమందు దేవుని దూత చేత నడిపించబడి ఐగుప్తుకు పారిపోయాడు (మత్తయి 2:13-15). ఆయన రాత్రివేళ శిశువును తల్లిని తీసుకొని వెళ్ళాడు. దీనిని బట్టి ఎంత ప్రమాదకరమైన పరిస్థితుల గుండా వారు వెళ్ళారో అర్థం చేసుకోవచ్చు.

హేరోదు చనిపోయేంత వరకు ఆయన ఐగుప్తులో ఉన్నాడంటే పరదేశిగా ఎలా జీవించాడో, ఎలాంటి త్యాగాలు చేశారో మనం ఆలోచించాలి, ఊహించాలి. అది సమృద్ధి కోసం వెళ్ళిన వలస కాదు, శరణార్థిగా వెళ్ళిన వలస. ప్రమాదకరమైన పరిస్థితుల నుండి పారిపోవడం. దేవుడు మనకు కలుగచేయబోయే రక్షణ మనకు చేరకుండా చేయాలనే సాతాను ప్రయత్నాలు ఆయన పుట్టుక నుంచే ప్రారంభమై చనిపోయేంతవరకు కొనసాగాయి. ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

## మరియ త్యాగం

మరియ కూడా పెళ్ళి కాకుండా గర్భం దాల్చడం ఈ లోక విధానంలో ఆలోచిస్తే తన వ్యక్తిత్వానికి ఒక మరక. అవమానం. ఆమె కూడా యోసేపులా ఈ లోకానికి రక్షణ తీసుకొని రావడానికి, సమాజంలో తనకు ఉన్న పరువును, మర్యాదను త్యాగం చేసింది. అప్పుడు ఉన్న సమాజంలో ఏ స్త్రీ అయినా జారత్వం చేస్తే రాళ్ళతో కొట్టి చంపుతారు. చాలా ప్రమాదకరమైన పరిస్థితుల గుండా ఆమె వెళ్ళింది. యోసేపు ఆమెను భార్యగా అంగీకరించడం ఆమెను మరణం నుండి తప్పించిందని చెప్పవచ్చు. ఆమె ఎన్ని అవమానాల గుండా వెళ్ళిందో మనం ఊహించుకోవచ్చు. తన కుమారుడిని దయ్యం పట్టినవాడని, మతిభ్రమించిందని విమర్శించినప్పుడు తాను పడిన వేదనను మనం అర్థం చేసుకోవచ్చు. తన కుమారుడైన యేసును దిగంబరిగా చేసి, కొడుతూ, సిలువ మీద మరణశిక్ష వేసినప్పుడు ఆమె వేదన వర్ణనాతీతం. దేవుడు తన సొంత కుమారుడైన యేసును మనకు అనుగ్రహించుటకు తండ్రి వెనుదీయలేదు (రోమా 8:32). ఇది గొప్ప త్యాగం. మరియ తన కుమారుడి మరణాన్ని ప్రత్యక్షంగా చూసి తట్టుకోవడం మామూలు విషయం కాదు.

## యేసు పుట్టిన కాలంలో తల్లుల త్యాగం

జ్ఞానులు తనను మోసం చేశారని హేరోదు గ్రహించి రెండు సంవత్సరాలకంటె తక్కువ వయసు గల మగపిల్లలను చంపమని ఆజ్ఞాపించడం అనేక కుటుంబాల్లో విషాదం నింపింది. బెత్లెహేముతోపాటు దాని సకల ప్రాంతాలు తల్లుల ఆర్తనాదాలతో నిండిపోయాయి. కారణం లేకుండా తమ కుమారుడు చంపబడటం దేవుడు ఈ లోకానికి ఇచ్చే రక్షణను (యేసుని) కాపాడడానికి, హేరోదు నేను

యూదుల రాజును చంపేశానని తృప్తి పొందడానికి ఉపయోగపడింది. దీనిని దేవుడు అనుమతించాడు. యేసు పుట్టుక కోసం, ఆయన సజీవంగా ఉండడం కోసం చాలామంది తల్లులు తమ కుమారులను కోల్పోయారు. ఇది కూడా దేవుని దృష్టిలో త్యాగమే. ఎందుకంటే ఆయన కోసం ఆయన అనుమతించాడు కాబట్టి.

## జ్ఞానుల త్యాగం

జ్ఞానులు ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ప్రయాణం చేసి బంగారము, బోళము, సాంబ్రాణిని అర్పించడానికి రావడమనేది త్యాగం క్రిందికే వస్తుంది. ఇలా చేయాలంటే వారి శక్తిని, సమయాన్ని, ధనాన్ని త్యాగం చేయాలి. యూదుల రాజు పుడితే మాకేంటి, మాకెందుకు, మేమెందుకు దర్శించాలని అనుకొంటే వారు రాలేరు. ఆయనను ఒక ప్రత్యేకమైన, అరుదైన వ్యక్తిగా వారు గుర్తించారు కాబట్టే దర్శించారు. విశిష్టమైన వ్యక్తిగా భావించారు కాబట్టే అమూల్యమైన, ఖరీదైన కానుకలు తెచ్చారు.

## నికోదేము, అరిమతయియ యోసేపు (యోహాను 19:38,39)


యూదుల భయము వలన రహస్యంగా యేసు శిష్యులైన నికోదేము, అరిమతయియ యోసేపు ఆయన చనిపోయినప్పుడు చేసిన త్యాగం మన కోసం రాయబడింది. నికోదేము 150 సేర్ల ఎత్తుగల బోళము తీసుకొని రావడం. అరిమతయియ యోసేపు తన కొరకు తొలిపించుకొన్న రాతి సమాధిలో ఆయనను ఉంచడం తన ఆధిక్యతను కోల్పోవడానికి ఇష్టపడినట్లు తెలియచేస్తుంది (మత్తయి 27:57-60).

## యేసు శిష్యులు వారి త్యాగము

యేసు జనన, మరణ, పునరుత్థాన వార్తను వివిధ దేశాలకు తీసుకెళ్ళి వారు హతసాక్షులుగా మారి పోవడమనేది సువార్త సందేశం కోసం వారు చేసిన త్యాగాన్ని తెలియచేస్తుంది.

## మిషనరీస్ త్యాగం

సువార్తను ఇతరులకు అందించడానికి వారు ఇతర దేశాలకు వెళ్ళి జీవితాలను, ఆధిక్యతలను త్యాగం చేశారు. కొంతమంది అవివాహితులుగా ఉండిపోయి పరిచర్య చేశారు. మరికొంతమంది వ్యాధులు, అనారోగ్యాలబారిన పడుతూ, అంగవైకల్యంతో కూడా



పరిచర్య చేశారు. కొంతమంది తమ భాగస్వాములను పోగొట్టుకొని పరిచర్య కొనసాగించారు. కొంతమంది హతసాక్షులయ్యారు. మిషనరీస్ త్యాగపూరితమైన జీవితాలే మనకు రక్షణ భాగ్యాన్ని తీసుకొచ్చింది.

## మన త్యాగం

సువార్త ప్రకటించడానికి అవమానకరమైన, ప్రమాదకరమైన పరిస్థితుల గుండా వెళ్ళిన గ్రాడ్యుయేట్స్ మనకు మాదిరిగా ఉన్నారు. ఆధిక్యతలను విడిచిపెట్టి సువార్త కొరకు సమర్పించుకొన్న మన పితరులైన స్టాఫ్ కూడా మనకు మాదిరిగా ఉన్నారు.

## క్రిస్మస్ సందేశం - త్యాగం

యేసుక్రీస్తు జన్మని, ఆయన ఇచ్చే నిత్యజీవాన్ని ఇతరులకు ప్రకటించడానికి, వారిని దేవునికి వారసులుగా చేయడానికి త్యాగం అవసరం. త్యాగం దేవుని దగ్గర నుండే మొదలైంది. తండ్రి, కుమారుడు త్యాగాలు చేయడం ద్వారానే లోకానికి రక్షణ వచ్చింది. క్రిస్మస్ అనేక త్యాగమూర్తుల సమాహారం. మనం త్యాగం చేయకుండా ఈ క్రిస్మస్ సందేశాన్ని ఇతరులకు అందించలేము.

అనేకమంది త్యాగఫలమే మనం పొందిన రక్షణ భాగ్యం కాబట్టి మనం ఇతరులకు సువార్తను అందించడానికి త్యాగం చేద్దాం. మన ఆధిక్యతలను త్యాగం చేయాల్సి రావచ్చు. మన ధనం, శక్తి, సమయం, విశ్రాంతి త్యాగం చేయవలసి రావచ్చు. దేవుడు మనకు మాదిరిగా ఉన్నాడు కాబట్టి మనం దేవునిని ప్రేమిస్తే ఆయన మాదిరిని అనుసరించకుండా ఉండలేము. కాబట్టి ఈ క్రిస్మస్ దినాల్లో ఆయన (రాకడ) పుట్టుక ఉద్దేశాన్ని తెలియచేయడానికి త్యాగపూరితంగా సువార్తను ఇతరులకు ప్రకటిద్దాం.

**– జి. జెర్మియా ప్రసాద్,** ఏపి-ఇజియఫ్ స్టాఫ్, తుని



# శరీరధారణ ఎందుకు?

*దేవుడు శరీరధారిగా భూమి మీదకు రావడం ..పరలోకం భూమిని ముద్దాడింది ...*

క్రిస్మస్ సందేశం, "తొట్టిలో ఉన్న శిశువు – దేవుడు అనే దిగ్భ్రాంతికరమైన వాస్తవంపై ఆధారపడి ఉంది" అని ప్రముఖ వేదాంతి జేఐ ప్యాకర్ అంటాడు. "క్రైస్తవులు నొక్కి ఉద్ఘాటించి చెప్పే గొప్ప అద్భుతం యేసుక్రీస్తు శరీరధారిగా రావడమే" అని సియస్ లూయిస్ అంటాడు. అందుకే క్రిస్మస్ అనేది అద్భుతాల న్నిటిలో అత్యద్భుతంగా పిలవబడుతుంది.

క్రీస్తు శరీరధారణ అనేది క్రిస్మస్ సందేశానికి హృదయం లాంటిది. యోహాను 1:14లో ఆ వాక్యము శరీరధారియై అనే పదాలు క్రిస్మస్ సందేశాన్ని అద్భుతంగా వివరిస్తాయి. అనంతుడు, నిత్యుడు, స్వయంభవుడు, స్వయం సమృద్ధి కలిగి నవాడు, సర్వశక్తిమంతుడైన దేవుడు తన దైవ స్వభావాన్ని కోల్పోకుండా, దైవ లక్షణాల్ని విడిచి పెట్టకుండా తన దైవ స్వభావానికి మానవ స్వభావాన్ని జోడించుకొన్నాడు. ఆయన పాపము లేకుండా మనలో ఒకనివంటి వాడై, ఒకే ఒక దైవ మానవుడు అయ్యాడు. సృష్టి కార్యములో మానవుడు దేవుని స్వరూపమందు చేయబడితే, శరీరధారణలో దేవుడు మానవ స్వరూపంలో చేయబడ్డాడు. "క్రీస్తు తన దైవత్వాన్ని తగ్గించుకోలేదు గానీ, శరీర బలహీనత యందు కనిపించకుండా ఉండునట్లు కొంతకాలం దానిని దాచి ఉంచాడు. తన యొక్క మహిమను తగ్గించుకోవడం ద్వారా కాదు గానీ మహిమను దాచడం వలన మానవ దృష్ట్యా, తన మహిమను పక్కన పెట్టాడు" అని జాన్ కెల్విన్ అనే భక్తుడు రాస్తాడు. "దేవుడు మానవుడిగా మారినప్పుడు పరలోకం భూమిని ముద్దాడింది" అని థామస్ గాడ్విన్ అనే భక్తుడు రాస్తాడు.

యేసుక్రీస్తు శరీరధారిగా రావడం అనేది చరిత్రకు, సంఘము యొక్క ఒప్పుకోలుకు కేంద్రబిందువు లాంటి వాస్తవము. కన్య మరియ గర్భములో యేసు అనే భావన మానవ జాతి చరిత్రలో విశిష్టమైనది.

1500సం॥లలో మార్టిన్ కెమ్నిట్జ్ ఇలా రాశాడు, "శరీరధారణ అనే సత్యాన్ని కోల్పోయినప్పుడు, యేసు ఇకపై మన రక్షకుడిగా ఉండలేదు. ఆయన శరీరధారణ అనేది మనకు తెలిసిన గొప్ప, మధురమైన ఆదరణ". ఐరిష్ సంఘ సంస్కర్త, జేమ్స్ ఉషర్ యేసుక్రీస్తు శరీరధారణ గురించి "ఇది దేవుని జ్ఞానం, మంచితనం, శక్తి, మహిమయొక్క అత్యున్నతమైన స్థాయి" అని చెప్పాడు.

ఈ క్రిస్మస్ రోజుల్లో యేసుక్రీస్తు జననం యొక్క ప్రాముఖ్యత ఏంటి? దాని అర్థము ఏంటి? అనే విషయాలను మనం ధ్యానం చేద్దాం.

## దేవుడు శరీరధారిగా ఎందుకు రావాల్సి వచ్చింది?

### 1. దేవుడు మానవాళికి ప్రత్యక్షపరచుకోవడానికి (యోహాను 1:18;14:7-11)

"తండ్రిని మానవులకు బయలుపరిచే భూతద్దం యేసుక్రీస్తే అని ఫిలిప్ యాన్సీ అంటాడు". "యేసుక్రీస్తుకు ముందు దేవుని యొక్క ప్రత్యక్షత పెన్సిల్ స్కెచ్ లాంటిదని" జాన్ కెల్విన్ అంటాడు. అయితే, యేసుక్రీస్తులో దేవుడు మనకు సుపరిచితమైన రూపంలో అందుబాటులోకి వచ్చాడు. రిచర్డ్ ఫిలిప్స్ రాసినట్లుగా, యేసు భూసంబంధమైన జీవన విధానం, కంఠస్వరము, దృక్పథం, సంఘటనల పట్ల ప్రతిస్పందనలు దేవుని లాంటివి. "దేవుడు క్రీస్తు

లాంటివాడు." క్రీస్తులో లేనిది దేవునిలో ఏమీలేదు. దేవుడు ఎలాంటివాడో తెలుసుకోవాలంటే క్రీస్తును అధ్యయనం చేయాలి. "దేవుని మహిమైశ్వర్యం క్రీస్తులో ప్రకాశించే వరకు అదృశ్యంగా ఉన్నది. క్రీస్తు స్వరూపంపై ముద్రితమై కనబడే వరకు తండ్రి ఔన్నత్యము దాగి ఉంది" అని కెల్విన్ అంటాడు.

శరీరధారిగా వచ్చిన వాక్యమైయున్న యేసు దేవుని స్వభావం యొక్క సంపూర్ణమైన రూపము. దేవుడు మానవ రూపంలో వ్యక్తీకరించబడ్డాడు. 'పూర్వము ప్రత్యక్ష గుడారము, దేవాలయంలోని అతిపరిశుద్ధ స్థలానికి పరిమితమైన దేవుని ప్రత్యేక ప్రత్యక్షత సన్నిధి, ఇప్పుడు శరీరధారియైన దేవుని రూపంలో ప్రపంచంలోకి విస్తరించింది. వాక్యంగా ఉండడం ఆగిపోకుండా శరీరముగా మారిన ఆ వాక్యము అదృశ్య తండ్రి యొక్క భాష్యకారి (యోహాను 1:18). యోహాను 14:9లో నన్ను చూసినవాడు తండ్రిని చూసియున్నాడు అని చెప్పాడు. ఆండ్రియాస్ జే కోస్టెన్ బెర్గర్ ప్రకారం, యేసు తన మాటలు, పనుల ద్వారా తండ్రిని బయలు పరచాడనేది యోహాను సువార్తకు పునాది. క్రీస్తు తన మాటలు, పనుల ద్వారా తండ్రిని నిజముగా వివరించాడు. "నీవు నాకు అనుగ్రహించిన మనుష్యులకు నీ నామమును ప్రత్యక్షపరచానని" యేసు అంటాడు (యోహాను 17:6).

### 2. మనలను విమోచించడానికి (గలతీ 4:5)

ఆయన స్త్రీ యందు పుట్టి, మనము దత్తపుత్రుల ము కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడి ఉన్నవారి ని విమోచించుటకై ధర్మశాస్త్రమునకు లోబడిన వాడాయెను.

పై లేఖనము గురించి జాన్ స్టాట్ ఇలా వ్యాఖ్యా నించాడు: ఈ వచనాలలో నొక్కిచెప్పబడింది ఏంటంటే, మన విమోచనను నెరవేర్చడానికి దేవుడు పంపిన వ్యక్తి, సంపూర్ణమైన అర్హత కలిగినవాడు లేదా యోగ్యుడు ఎందుకంటే.. ఆయన దేవుని కుమారుడు, మానవ తల్లి నుండి కూడా జన్మించాడు, అందువల్ల ఆయన మానవుడు, దేవుడు, ఏకైక దైవ-మానవుడు. ఆయన ధర్మశాస్త్రము క్రింద, అంటే యూదు తల్లి నుండి, యూదా దేశంలో, యూదా ధర్మశాస్త్రానికి లోబడి జన్మించాడు. తన జీవితాంతం ఆయన ధర్మశాస్త్రములోని అన్ని ఆజ్ఞలకు, నిబంధనలకు లోబడి జీవించాడు. అంతకు ముందు, తర్వాత అందరూ విఫలమైన చోట ఆయన విజయం సాధించి ధర్మశాస్త్ర నీతిని సంపూర్ణముగా నెరవేర్చాడు.

స్టాట్, పౌలు యొక్క వేదాంతపరమైన అంత ర్భావాన్ని ఇలా వివరిస్తాడు: "కాబట్టి క్రీస్తు దైవత్వం, క్రీస్తు మానవత్వం, క్రీస్తు నీతి, ఆయనను మానవుని విమోచకునిగా ఉండడానికి అద్వితీయమైన అర్హతను ఇచ్చాయి. ఆయన మానవుడు కాకపోతే, మనుష్యుల ను విమోచించలేడు. ఆయన నీతిమంతుడు కాకపోతే, నీతిమంతులుగా తీర్చలేడు. దేవుని కుమారుడై ఉండకపోతే, దేవుని కొరకు మనుష్యులను విమోచించలేడు లేదా వారిని దేవుని కుమారులుగా చేయలేడు. కుమారుని పంపడం మనకు కుమారత్వ స్థితిని సంపాదించిపెడుతుంది. మనం కూడా 'నాయనా, అబ్బా అని ఆయనలాగే మొర్రపెడతాము.

### 3. ప్రధానయాజకునిగా మనకు ప్రాతినిధ్యం వహించడానికి (హెబ్రీ 2వ అధ్యాయం)

ప్రధానయాజకుడిగా మనకోసము విజ్ఞాపన చేయడానికి మాత్రమే కాకుండా హెబ్రీ 8:1-2లో చెప్పినట్లు ఆయన గుడారములో పరిచారకుడుగా ఉండడానికి కూడా ఆయనకు మానవత్వం అవసరం. శరీరధారణ లేకుంటే, మానవాళికి సేవ చేసే అర్హత ఎవరికీ ఉండదు. "యేసు ప్రధానయాజకునిగా చేయాల్సిన పని స్వభావం శరీరధారణను కోరింది లేదా తప్పనిసరి చేసింది" అని లియోన్ మోరిస్ అనే వేదాంతి రాస్తాడు. యేసు మనపై అంతగా సానుభూతి చూపించడానికి కారణం ఆయన నిజమైన మానవుడు కావడమే. యేసు మానవునిగా ఉన్నాడు గనుకనే మనము ఎలాంటి బాధలు పడతామో ఆయనకు అనుభవపూర్వకంగా తెలుసు. కాబట్టి మనకు సహాయం చేయడానికి ఆయన సహానుభావము గల వాడు.

### 4. మనకు ప్రత్యామ్నాయముగా ప్రాయశ్చిత్తము చేయడానికి (యెషయా 53; 2 కొరింథీ 5:21; హెబ్రీ 10)

ప్రత్యామ్నాయం అనే భావన పాపం విషయంలోను, రక్షణ విషయంలోను కేంద్రబిందువు. రక్షణ యొక్క సారాంశమేంటంటే మనిషికి బదులుగా దేవుడే తనను తాను ప్రత్యామ్నాయంగా సమర్పించుకోవడం. దేవుడు తనను తాను మనిషి కోసం త్యాగం చేసి మనిషి యొక్క స్థానాన్ని తీసుకోవడం. మనం

అనుభవించాల్సిన శిక్షను, మన అపరాధాలను దేవుడు తన కుమారుడైన క్రీస్తు మీద మోపాడు. మనం పొందాల్సిన దేవుని ఉగ్రతను, నరక శిక్షను మనకు ప్రత్యామ్నాయంగా క్రీస్తు అనుభవించాడు. మనకు బదులు మన మరణాన్ని పొందాడు. ఒకే ఒకే దైవ-మానవుడుగా మధ్యవర్తి అయిన యేసుక్రీస్తు అనే చారిత్రాత్మక సిద్ధాంతాన్ని ఎత్తిపట్టకుండా చారిత్రక సిలువ సిద్ధాంతాన్ని పట్టియుంచడం అసాధ్యమనే వేదాంతపరమైన భావం ఇక్కడ ఇమిడి ఉంది. మనిషిగా క్రీస్తు ఒక్కడే లేదా దేవుడుగా తండ్రి ఒక్కడే మనకు ప్రత్యామ్నాయం కాలేడు. మనిషిగా వచ్చిన తన ఏకైక, స్వంత కుమారునిలో మాత్రమే మన యొక్క స్థానాన్ని తీసుకోగలడు. సిలువను వక్రీకరిస్తూ లేదా హేళనచేస్తూ గీసే ప్రతి చిత్రం యొక్క మూలంలో వక్రీకరించబడిన క్రీస్తు శాస్త్రము ఉంటుందని జాన్‌స్టాట్ అనే భక్తుడు అంటాడు. క్రీస్తు యొక్క పని, వ్యక్తిత్వం కలిసియుంటాయి. ప్రాయశ్చిత్తానికి క్రీస్తు యొక్క శరీరధారణ అనివార్యం.

### 5. అపవాది క్రియలను, అపవాదిని నాశనము చేయడానికి (హెబ్రీ 2:14-15)

మరణ బలము కలిగిన అపవాదిని నశింప చేయడానికి, మరణ భయము చేత దాస్యత్వానికి లోబడిన వారిని విడిపించడానికి ఆయన కూడా రక్తమాంసములలో పాలివాడయ్యాడు (హెబ్రీ 2:15-16). మరణం అనేది మానవాళిని బానిసత్వంలోకి నెట్టడానికి అపవాది ఉపయోగించే సాధనం. యేసు మరణాన్ని జయించాడు. ఒక మానవుడిగా చనిపోయినప్పుడు, ఆయన మరణాన్ని మానవ స్థాయిలో ఎదుర్కొని, దాని ఆధిపత్యాన్ని నాశనం చేశాడు. తద్వారా సాతాను బలాన్ని బలహీనపరచి, నిరర్థకం చేశాడు. ఆయన మనపక్షాన సాతానును ఓడించి అతని బంధీలనుగా ఉన్న మనలను విడిపించాడు. మరణ భయము అవిశ్వాసులకు భయానక రాజు అయితే విశ్వాసులకు అది నిత్య మహిమకు మార్గము.

1 యోహాను 3:8 లో అపవాది క్రియలను లయం చేయడానికి మనుష్య కుమారుడు ప్రత్యక్షమయ్యాడని రాయబడింది. అంటే క్రీస్తు మొదటి ప్రత్యక్షత ఉద్దేశ్యం పాపాలను తీసివేయడం, అపవాది క్రియలను లయం చేయడం అయితే, క్రైస్తవులు పాపం లేదా అపవాదితో రాజీ పడకూడదు. అలా రాజీపడితే వారు క్రీస్తుకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు అని జాన్‌స్టాట్ అనే భక్తుడు వ్యాఖ్యానిస్తాడు. క్రీస్తు శరీరధారణ లేకపోతే ప్రాయశ్చిత్తం లేదు, ప్రాయశ్చిత్తం లేకపోతే దుష్టునిపై లేదా అపవాదిపై విజయం లేదు.

### 6. మానవ జీవితానికి పరిపూర్ణమైన మాదిరి లేదా నమూనాను ఇవ్వడానికి

పరిపూర్ణ మనిషిగా, ఎలా జీవించాలో క్రీస్తు మనకు చూపించాడు. మనం "ఆయన నడిచిన విధంగానే నడవాలి" (1 యోహాను 2:6). "క్రీస్తు కూడా మీ కోసం బాధపడ్డాడు. మీరు అతని అడుగుజాడల్లో నడవడానికి ఒక మాదిరిని ఉంచాడు" (1 పేతురు 2:21). తన పాపరహిత జీవితం ద్వారా, యేసు క్రైస్తవ జీవనానికి పరిపూర్ణ నమూనాను ఇచ్చాడు.

క్రీస్తులాగా జీవించకుండా ఆయనలో ఉన్నామని మనం చెప్పుకోకూడదు (1 యోహాను 2:6). క్రీస్తు సారూప్యం దేవుని ప్రజలకు దేవుని చిత్తం.

### ముగింపు

అనంత దూరంలో ఉన్న రెండు స్వభావాలు ప్రపంచంలో అన్నిటికంటే ఎక్కువ సన్నిహితంగా ఐక్యము కావడము ఎంత అద్భుతము! "శరీరధారణ మనల్ని విస్మయానికి లేదా ఆశ్చర్యానికి గురిచేయాలి ఎందుకంటే పూర్తిగా అఘోచరమైనదని" అభిప్రాయపడతాడు బావింక్ అనే ప్రముఖ వేదాంతి. ఒకే వ్యక్తి మహిమను, దు:ఖాన్ని కలిగియుండడం, దైవత్వములో అనంత ఆనందం, మానవత్వములో చెప్పజాలని బాధ; సింహాసనముపై ఉన్న దేవుడు ఊయలలో శిశువుగా ఉండడము, గర్జించే, ఉరిమే సృష్టి కర్త ఏడుస్తున్న పసికందుగా, బాధింపబడే లేదా హింసింపబడే మనిషిగా క్రీస్తు యొక్క అవతారము భూమి మీద ఉన్న మనుష్యులను, పరలోకములో ఉన్న దేవదూతలను ఆశ్చర్యపరుస్తుంది. ఆ దైవికజ్ఞానము ముందు మన హృదయాన్ని జ్ఞానాన్ని వంచి సాగిలపడడానికి సరిపోతుంది. ఆయనను ఆరాధిద్దాం. పాపులు, తిరుగుబాటుదారులను రక్షించడానికి తనను తాను దేవునికి బానిసగాను, పాపులకు పరిచారకునిగాను తగ్గించుకొన్న యేసుక్రీస్తును అనుకరిద్దాము. మనము సేవించే దేవుడు దీనుడు. ఇతరులను తన కంటే ఎక్కువగా ఎంచి తనను తాను సమర్పించుకొన్న యేసుక్రీస్తు మాదిరి అవలంబిద్దాం.

**- పి. నాసరయ్య**, వైజాగ్



# క్రీస్తు కన్యకకు జన్మించడం?

## 1. అసాధారణ సంఘటన

"ఇదే క్రిస్మస్.. ఇదే క్రిస్మస్..." అని పాడుతూ పిల్లలు క్రిస్మస్ నాటిక వేస్తున్నారు. మరియమ్మలా నటిస్తున్న ఒక చిన్నపాప చేతుల్లో ఉన్న బొమ్మ చూడడానికి చాలా అందంగా ఉంది. అప్పుడు వెంటనే ఒక ఆలోచన నా మనసులో మెదిలింది. "ఆ పాప చేతులలో ఉన్న బొమ్మ నిజమైన బిడ్డ అయ్యుంటే ఎలా ఉంటుంది? ఆ బొమ్మ ఒక బాలుడై ఉంటే ఎలా ఉంటుంది? ఆ చిన్న పాప వేదిక మీద భయం భయంగా ఉంది. తర్వాత ఏ డైలాగు చెప్పాలో గుర్తు చేసుకొంటూ, తన సండే స్కూల్ టీచర్ వైపు చూస్తుంది. బహుశా యవ్వనదశలో ఉన్న కన్యయైన మరియ భావోద్రేకాలు ఎలా ఉండి ఉంటాయో? ఆమె వయసులో చాలా చిన్నదే కాని ఎంతో అవమానాన్ని, శ్రమను భరించింది. రాళ్ళతో కొట్టబడి చంపబడడానికి సిద్ధమయ్యింది. మెస్సీయ జననం నిజం. అదేవిధంగా ఆయన కన్యకకు జన్మించడం అనేది కూడా నిజం. క్రిస్మస్ మన అందరికీ ఒక సంతోషకరమైన వేడుక. కానీ మరి యకు అది సంతోషకరమైన వేడుక కాదు. అంతటి కఠినమైన పనిని చేయమని మరియను దేవుడు ఎందుకు కోరాడు? ఒక అవిశ్వాసికి క్రిస్మస్ గురించి, క్రీస్తు కన్యకు జన్మించాడని చెప్పినప్పుడు, అతడు ఎగతాళి చేయవచ్చు. క్రైస్తవులను హేళన చేస్తాడు. ఇంత కష్టమైన పనిని దేవుడు మనకు ఎందుకు ఇచ్చాడు? క్రీస్తు కన్యకకు జన్మించడం అవసరమా? ఈ విషయాల్ని తెలుసుకొందాం.

## 1. క్రీస్తు కన్యకకు జన్మించడం నిజమా? లేక అది ఒక కల్పిత కథా?

క్రీస్తు కన్యకకు జన్మించాడనే విషయం సువార్తలన్నిటిలో లేదు కాబట్టి, ఈ విషయం ఒక కల్పిత కథే అని కొంతమంది నాస్తికులు వాదిస్తుంటారు. వారు చెప్పేది అసత్యమని స్పష్టంగా అర్థమౌతుంది. మత్తయి సువార్త 1:22-25, లూకా సువార్త 1:34-37లో ఈ విషయం స్పష్టంగా రాసినట్లు మనం చూడగలం. మార్కు, యోహానులు తమ సువార్తలలో క్రిస్మస్ విషయాలను ప్రస్తావించలేదు. కాబట్టి ఆ రెండు సువార్తలలో ఈ విషయం మనకు కనిపించదు. కన్యకకు జన్మించడం వివాదాస్పదమైన విషయం, అసత్యమైతే, చరిత్రకారుడు, ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా పరిశోధించి తెలుసుకొనే (లూకా 1:1-4), ఈ విషయాన్ని తన గ్రంథంలో రాసి ఉండేవాడు కాదు. యేసు తల్లియైన మరియను కలిసి, తానే స్వయంగా ఈ విషయాన్ని తెలుసుకొని, మరికొన్ని విషయాలతో కూడా సరిచేసుకొని, ధృవీకరించుకొన్న తర్వాతే ఈ విషయాన్ని రాసి ఉంటాడు. మత్తయి, లూకా సువార్తలను ఆధారం చేసుకొని క్రీస్తు కన్యకకు జన్మించాడనే విషయాన్ని స్పష్టంగా, నిస్సందేహంగా చెప్పవచ్చు. మనం అద్భుతాలను నమ్మేవారమైతే ఈ విషయాన్ని కూడా మనం నమ్ముతాము. శూన్యము నుండి దేవుడు ఈ విశ్వాన్ని సృజించాడని మనకు తెలుసు (ఆది 1:1,2). ఆయన నీటిని ద్రాక్షారసంగా మార్చాడు (యోహాను 2). మరణించిన లాజరును నాలుగు రోజుల తర్వాత లేపాడు (యోహాను 11). అదే విధంగా, ఒక కన్యక ద్వారా అద్భుతరీతిలో క్రీస్తు ఈ లోకానికి వచ్చాడు.

## 2. ప్రవచనాత్మకం

మెస్సీయ పుట్టుకను గూర్చి, పాతనిబంధనలోని ప్రవక్తలు ప్రవచించారు. క్రీస్తు దైవత్వాన్ని రుజువు

చేసే వాటిలో కన్యక జన్మ ఒక అత్యంత విశిష్టమైన రుజువు. క్రీస్తు జన్మను ఆదికాండం 3:15లో దేవుడు ముందుగానే ప్రవచించాడు. ఒక స్త్రీకి జన్మించే సంతానం సర్పము తలను చితక గొడతాడని దేవుడు సర్పంతో చెప్పాడు. "మరియు నీకును స్త్రీకిని, నీ సంతానమునకును ఆమె సంతానమునకు వైరము కలుగజేసెదను. అది నిన్ను తల మీద కొట్టును, నీవు దాని మడిమ మీద కొట్టుదువని చెప్పెను" (ఆది 3:15). క్రీస్తు పుట్టక మునుపు 700 సం॥ల క్రితం యెషయా అనే ప్రవక్త యేసుక్రీస్తు కన్యకకు జన్మిస్తాడని ప్రవచించాడు."కాబట్టి ప్రభువు తానే యొక సూచన చూపును. ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేల ను పేరు పెట్టును" (యెషయా 7:14).

మత్తయి తన సువార్తలో క్రీస్తు కన్యకకు జన్మిస్తాడని యెషయా చెప్పిన ప్రవచనం నెరవేరిందని రాస్తూ, యెషయా ప్రవచనాన్ని తన సువార్తలో ఉటంకించాడు (మత్తయి 1:22,23). యవ్వనురాలైన స్త్రీ అని యెషయా రాశాడు, అయితే ఆ పదాన్ని మత్తయి తప్పుగా అర్థం చేసుకొని కన్యక అని రాశాడని కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేస్తుంటారు. యెషయా ఉపయోగించిన 'అల్మా' అనే హెబ్రీ పదాన్ని "యవ్వనురాలైన స్త్రీ" లేదా "కన్యక" అని తర్జుమా చేయవచ్చు. "బెతులా" అనే మరొక హెబ్రీ పదం ఉన్నప్పటికీ, దాని అర్థం కూడా "యవ్వనురాలైన స్త్రీ". కన్యక అనే ఖచ్చితమైన అర్థమిచ్చే పదం యెషయా జీవించిన కాలం నాటి హెబ్రీ భాషలో లేదు. మరొక ముఖ్య విషయం ఏంటంటే అల్మా అనే పదం పెళ్ళికాని అమ్మాయికి మాత్రమే వాడతారు. కాబట్టి యెషయా "అల్మా గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలు అని పేరు పెట్టును" (యెషయా 7:14) అని చెప్పినప్పుడు పెళ్ళి కాలేదు కాబట్టి, ఇమ్మానుయేలుగా దేవుడే జన్మిస్తున్నాడు కాబట్టి కన్యక అని మాత్రమే తర్జుమా చేయాలి. అపోస్తలుడైన పౌలు కూడా ఇలా రాశాడు: "అయితే కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను; ఆయన స్త్రీయందు పుట్టి.." (గలతీ 4:4-5) అనే మాటలను ఆది 3:15 నుండి ఉటంకించాడు. కాబట్టి, పురుష ప్రమేయం లేకుండా స్త్రీ నుండి మెస్సీయ రావాల్సి ఉన్నదని, కన్యక గూర్చి యెషయా ప్రవచించాడు. ఆ ప్రవచనం యేసుక్రీస్తులో మాత్రమే నెరవేరిందనే విషయాన్ని మత్తయి తెలియజేశాడు. అలాగే మరియ "నేను పురుషుని ఎరుగని దానిని ఇది ఎలాగు జరుగునని" (లూకా 1:34) దూతతో అన్న విషయాన్ని కూడా మనం గమనించినప్పుడు, ఖచ్చితంగా, ప్రవచనాలను నెరవేరుస్తూ, కన్య మరియకు యేసుక్రీస్తు జన్మించాడనే సత్యాన్ని గ్రహించవచ్చు.

## 3. సాధ్యములు: క్రీస్తు కన్యకకు జన్మించడం సాధ్యమని చెప్పడానికి శాస్త్రీయమైన రుజువులు ఉన్నాయా?

అనిషిక్త జననము అంటే స్త్రీ పురుష సంయోగము లేకుండా లేదా పురుష ప్రమేయం లేకుండానే అండము భ్రూణముగా లేదా పిండముగా అభివృద్ధి చెందే ప్రక్రియ. దీనిని ఆంగ్లములో పార్థినోజెనిసిస్ అంటారు. ఈ ఆంగ్ల పదం "కన్యక జన్మ" అని అర్థమిచ్చే ఒక గ్రీకు పదంనుండి ఉద్భవించింది. పచ్చదోమ, ఈగలు, చీమలు వంటి అనేక కీటక జాతులలో పార్థినోజెనిసిస్ విధానం ద్వారా పునరుత్పత్తి జరుగుతుంది. కొన్ని క్షీరద (పాలిచ్చి పెంచే జంతువుల) జాతులలో కూడా ఇది సాధ్యమని కొందరు శాస్త్రవేత్తల ప్రయోగాలలో రుజువైంది. అయితే, కన్య మరియ గర్భంలో అనిషిక్త జనన ప్రక్రియ జరిగిందని నేను చెప్పడం లేదు. X క్రోమోజోములు, Y క్రోమోజోములకు సంబంధించిన విషయాలను కూడా కొంతమంది తమ వాదనల్లో ప్రస్తావిస్తుంటారు. మరియ గర్భంలో కణవిభజన జరిగిందని చెబుతుంటారు. అయితే ఇలాగే జరిగిందని మనం చెప్పడం లేదు. అది దేవుని అద్భుతకార్యం అని బైబిల్ తెలియజేస్తుంది. బైబిల్ తెలియజేయని విషయాలను ఊహించి చెప్పకుండా మనం జాగ్రత్తపడాలి. దేవుడు శరీరరూపంలో వచ్చి మరియతో కలిశాడని కొందరు అతివాదులు మాట్లాడుతుంటారు. ఇది పూర్తిగా నిరాధారమైన విషయం. "పరిశుద్ధాత్మ శక్తి నీ మీదికి వచ్చును. సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును" (లూకా 1:35). వెర్నర్‌పోయిన్‌ట్రెస్ అనే వేదాంత పండితుడు ఇలా అన్నాడు: "ఈ విశ్వం ఆధీనంలో దేవుడు లేడు. వ్యక్తిత్వంలేని శక్తివంతమైన నియమావళితో కూడిన ఒక వ్యవస్థలో ఆయన చిక్కుకొనలేదు.

దేవుడు అన్నిటికీ నియమాలను ఏర్పరచినవాడు. సాధారణమైన, అసాధారణమైన విషయాలన్నిటికీ మూలం ఆయనే. తన చిత్తానుసారంగా ఆయన అద్భుతాలు చేయగలిన దేవుడు. "మన రక్షణ కోసం సర్వశక్తిగల దేవుడు కన్యక జన్మ అనే అద్భుతాన్ని జరిగించాడు. హల్లెలూయా!! దేవుడు దీనిని మర్మంగానూ, అద్భుతంగానూ ఉంచదలిచాడు. మనం కూడా ఈ విషయాన్ని అలానే ఉంచుదాం.

### 4. అవిశ్వాసులకు జవాబు చెప్పే ప్రక్రియ

కన్యక జన్మ గూర్చి ఎవరైనా ప్రశ్నించినప్పుడు ఈ క్రింది విషయాలను వివరించవచ్చు.

ఎ. అదొక చారిత్రక సంఘటన. క్రొత్త నిబంధన ఒక చారిత్రక గ్రంథము, కన్యక జన్మ అనే విషయాన్ని మత్తయి, లూకాలు తమ గ్రంథాలలో ప్రస్తావించారని చెప్పాలి. ఒక తత్వవేత్త ఒకసారి ఇలా చెప్పాడు: "మనం హిస్టరీని నమ్మాలి, అది మిస్టరీ అయినప్పటికీ కూడా".

బి. అద్భుతాలను సైన్స్ తిరస్కరించదు. దేవుడు జోక్యం చేసుకొన్నప్పుడు అద్భుతాలు జరుగుతాయి. ఆధునిక చరిత్రలో కూడా దేవుడు చేసిన అద్భుతకార్యాలను మనం చూడవచ్చు.

సి. దేవుడు మానవునిగా, మానవ చరిత్రలో చేయబోతున్న గొప్ప ప్రవేశాన్ని ప్రకటించడానికి దేవుడు చేసిన అద్భుతమే కన్యక జన్మ. మానవునిగా దేవుడు ఈ భూమి మీదికి రావాలనుకొంటే, ఆ రాక విశిష్టమైనదిగాను, ప్రత్యేకంగాను ఉండాలి.

డి. యేసుక్రీస్తు పాపరహిత జీవితం, ఆయన చేసిన అద్భుత కార్యాలు, మానవ సమస్యలకు ఆయన చూపిన పరిష్కారాలు, ఆయన మరణం, పునరుత్థానం, ఆరోహణంలను మనం గమనించినప్పుడు, ఆయన కన్యకకు జన్మించాడని మనం ధృఢంగా, ధైర్యంగా నమ్మవచ్చు.

ఇ. మనందరినీ రక్షించబోయే రక్షకుడైన దైవమానవుడు, పాపరహితంగా ఉండడానికి కన్యక ద్వారా జన్మించడం ఎంతో అవసరం.

ఎఫ్. యేసుక్రీస్తు కన్యకకు జన్మించాడనే సత్యం ఆయన దైవత్వాన్ని రుజువు చేస్తుంది.

### 5. ప్రాధాన్యత: ప్రాముఖ్యత, అంతర్భావం

మరియకు ఇది ఎంతో బాధాకరమైన అనుభవం. అవిశ్వాసులకు ఈ సత్యాన్ని వివరించడం మనకు కష్టమైన విషయం. అయినప్పటికీ దేవుడు ఎందుకు ఈ విషయాన్ని అనుమతించాడు? కన్యక జన్మ యొక్క ప్రాథమిక అవసరం ఏంటంటే, పాపాత్ములైన మానవజాతిని రక్షించడానికి పాపరహితుడైన మెస్సీయ అవసరం. సాధారణమైన మానవ జన్మ ద్వారా మానవుడు జన్మత: పాపిగా జన్మిస్తున్నాడు. ఆదామునుండి పాపం అన్ని తరాల వారికి, ప్రతి మానవునికి జన్మత: సంక్రమించింది. మన పాపములకు పరిహారాన్ని చెల్లించే ఒక పరిపూర్ణమైన ప్రతినిధిగా, పాపరహితునిగా యేసుక్రీస్తు ఉండాలనే విషయాన్ని కన్యకజన్మ సుసాధ్యం చేసింది. యేసుక్రీస్తు 100% పరిశుద్ధునిగా ఉండాలి, 100% దేవునిగా ఉండాలి, 100% మానవునిగా ఉండాలి. ఈ గొప్ప విషయాన్ని నెరవేర్చడానికి దేవుడు తన అనంత జ్ఞానం ద్వారా కన్యక జన్మ అనే విధానాన్ని ఎన్నుకొన్నాడు. కన్యక జన్మ లేకపోతే, పాపులకు రక్షణ లేదు. కన్యక ద్వారా జన్మించిన యేసుక్రీస్తు ద్వారా దేవుడు మానవులను రక్షించాలనుకొన్నాడనే సత్యాన్ని మనం అర్థం చేసుకోవాలని దేవుడు కోరుకొంటున్నాడు.

ఎ. మన రక్షణను సుసాధ్యం చేయడానికి కన్యక ద్వారా జన్మించడం అనే ప్రణాళికను ప్రభువు ఎంచుకొన్నందుకు మనం ఆయనకు ఎల్లప్పుడూ కృతజ్ఞతాస్తోత్రాలు చెల్లిద్దాం. ఆయనను ఆరాధిద్దాం!

బి. దేవుని ప్రణాళికలను నెరవేర్చడానికి మరియ వలె మనం కూడా దేవునికి లోబడుదాం, ఆయనకు సమర్పించుకొందాం, ఎలాంటి కష్టమైనా, శ్రమైనా భరిద్దాం.

సి. లోకంలోకి వెళ్ళి ధైర్యంగా సువార్తను ప్రకటిద్దాం. క్రీస్తు జన్మ విశిష్టమైనదని, సాటిలేనిదని ఎలుగెత్తి చాటుదాం. మనలను తన పిల్లలుగా చేసుకొన్న ఆ దేవాది దేవుని గూర్చి సంతోషిద్దాం. ఆయన పట్ల భయభక్తులు కలిగి జీవిద్దాం. ఇతర సందర్భాలు, కాలాల వంటిది కాదు ఈ క్రిస్మస్. మన సంతోషానికి, మన నిత్యత్వానికి, నిత్యజీవానికి కారణమైన ఘట్టం ఈ క్రిస్మస్!

– యం. కోదండరామ్, హైదరాబాద్

# క్రీస్తు మనసు - సహవాసంలో ఐక్యత

**ఫిలిప్పీ 2:1-11**

తండ్రి దగ్గరకు కుమారుడు వచ్చి "నాన్న నాకు, చెల్లికి అన్నీ ఇచ్చేశావు మరి నీకేమీ లేవని బాధపడుతున్నావా?" అని అడిగితే ఆ తండ్రి చిన్నగా నవ్వి ఎంతో సంతృప్తితో "మీకు అన్నీ ఇచ్చేసినా కూడా "నేను నేనే కదా" అని అంటాడు. ఆదిసంభూతుడు, అనంతుడైన క్రీస్తు మానవాళిని ప్రేమించి, తన కంటే, పనుల కంటే ప్రతి మానవుని యోగ్యునిగా ఎంచి తన స్థితిని, హోదాను, ఆధిక్యతలను పక్కన పెట్టి, రిక్తుడిగా చేసుకొని, మానవునిగా, దాసునిగా జన్మించి, పరిశుద్ధంగా జీవించి, ఘోరమైన, శాపగ్రస్తమైన సిలువ మరణం పొంది మనం కోల్పోయిన, పోగొట్టుకొన్న స్థితిని, సంబంధాన్ని మరలా ఇచ్చారు.

ఈ విధంగా వినయంతో స్వయం సమృద్ధి కలిగిన, దైవ మానవుడైన యేసు మానవుని ప్రేమించి తండ్రికి తనను తాను విధేయతతో అప్పగించుకొన్నాడు. ఈ మనసు కలిగిన ప్రభువు మనకెంతో మాదిరి. తద్వారా తన దైవత్వాన్ని అనుమానిస్తారని, అవమానిస్తారని తెలిసి కూడా గుర్తింపు కోసం ప్రాకులాడలేదు, మనుషుల మెప్పుకోసం జీవించలేదు, ప్రతి చోట నిరూపించుకోవడానికి అసలు ప్రయత్నించలేదు.

**నేపథ్యం:** క్రీస్తు నిమిత్తం, సువార్త నిమిత్తం చెరసాలలో బందీగా ఉన్న పౌలు ప్రభువులో ఆనందిస్తూ రెండవ మిషనరీ ప్రయాణంలో యూరప్ ఖండంలో స్థాపించిన మొదటి సంఘమైన ఫిలిప్పీ సంఘానికి ఉత్తరం రాస్తూ అకారణంగా తోటి వారిని ద్వేషించక, ఇతరుల మెప్పు కోసం, పోటీ తత్వంతో కాక ప్రతి వ్యక్తిని నీకంటే యోగ్యునిగా, విలువైన వానిగా ఎంచుకోవాలని, వైఖరిలో, క్రియలలో కూడా తోటి వారికి ప్రాధాన్యత ఇస్తూ సహవాసంలో ఎంతో ప్రాముఖ్యమైన ఏక మనసు, ఐక్యత కొరకు పాటుపడాలని తెలియజేశాడు. ఇందుకుగాను త్రియేక దేవుడు పౌలుకు తెలియజేసిన సర్వపరిపూర్ణుడైన, మహోన్నతుడైన యేసు యొక్క మనసు/వైఖరి అందరికి మాదిరిగా ఉండాలని స్పష్టంగా వివరించాడు.

## ప్రశ్నలు

1. ప్రస్తుత సంఘం, సహవాసంలో వేటి మీద ఎక్కువ దృష్టిని కేంద్రీకరిస్తున్నారు? ఎందుకు? సహవాసంలో ప్రాముఖ్యమైనవి ఏంటి? ఎందుకు?
2. ఏకమనసు కలిగి జీవించడం అంటే ఏమిటి? ఐక్యత ఎందుకు కలిగి ఉండాలి? ఏమి ఉంటే ఐక్యతను కలిగి ఉండగలమని పౌలు బోధిస్తున్నాడు?(1,2)
3. తోటి వ్యక్తిని యోగ్యునిగా ఎంచడంలో అడ్డు వచ్చేవి ఏంటి? ఎందుకు?(3,4) తోటి వ్యక్తిని యోగ్యునిగా ఎంచితే కలిగే ఫలితాలు ఏంటి?(2)
4. క్రీస్తుయేసు ఎలాంటి మనసు/వైఖరి కలిగి ఉన్నాడని పౌలు రాస్తున్నాడు?(5-8)
5. రిక్తునిగా చేసుకోవడం అంటే ఏంటి? క్రీస్తు ఎందుకు రిక్తునిగా చేసుకొన్నాడు?(6-8)
6. ఆయన వైఖరి, మన వైఖరిని ఎలా సవాలు చేస్తుంది?
7. క్రీస్తు మాదిరి నుండి ఏ లక్షణాలను నేర్చుకోగలం? క్రీస్తు మాదిరి నిన్ను ఏ విధంగా పురికొల్పి, ప్రోత్సహించి, హెచ్చరించి, సవాలు చేస్తుంది?
8. కుమారుని విధేయత చూసి తండ్రి అయిన దేవుడు కుమారుని ఏవిధంగా ఘనపరుస్తున్నాడు? (9-11)
9. సహవాసంలో ఐక్యత లోపించిందని ఎలా గుర్తించగలం? యేసు మనసును కలిగి జీవిస్తున్న వ్యక్తి సహవాసం, సమాజంపై ఎలాంటి ప్రభావాన్ని చూపించగలడు?
10. ఇటీవల కాలంలో సహవాసంలో ఐక్యతను పెంపొందించడానికి నీవు చేసిన ప్రయత్నాలు ఏంటి? అందుకు ఎదురైన ఆటంకాలు ఏంటి? వాటిని అధికమించడానికి ఎలాంటి ప్రయత్నాలు చేశావు? ఎటువంటి ప్రయత్నాలు చేస్తే మంచి ఫలితాలను చూడగలము?

మన పట్ల, దేవుని పట్ల మన వైఖరిని సిలువ విప్లవాత్మకంగా మారుస్తుంది - జాన్‌స్టాట్

**- బి. తబిత రాజ్‌కుమార్**, స్టాఫ్, తిరుపతి



## సంఘ సంస్కర్త

# మార్టిన్ లూథర్

మార్టిన్ లూథర్ హృదయం రగులుతోంది. ఆనాటి సంఘం, పోప్‌లు దేవుని వాక్యానికి వ్యతిరేకంగా చేసే ఆచారాలు, పనులు చూస్తూ తట్టుకోలేకపోతున్నాడు. తానేమి చేయాలని దేవుడు కోరుతున్నాడో ఆయనకు స్పష్టంగా అర్థమైంది. విశ్వాసమనేది నిర్వచింపబడేది కాదు, ప్రదర్శింపబడేది అనే ఆలోచనతో సాహస విశ్వాసిగా తన ప్రాణానికి తెగించి పని ప్రారంభించాడు.



అది 1517 అక్టోబర్ 31వ తేదీ సాయంకాల సమయం. దాన్ని 'పరిశుద్ధ సాయంకాలం' అంటారు. మరుసటి రోజు నవంబర్ 1 'సర్వ పరిశుద్ధుల పండుగ' దినము. జర్మనీలోని విటెన్‌బర్గ్ దేవాలయంలో జరిగే సాయంకాల ఆరాధన కొరకు ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు. ఆ సమయంలో టోపీ, ఆచార్యుని అంగీ ధరించిన మార్టిన్ లూథర్ అగస్టీన్ మఠాన్ని వదిలి వ్యాపారకూడలి వైపు ధైర్యంగా నడుస్తూ, విటెన్ బర్గ్‌లోని దేవాలయం వైపు అడుగులు వేసుకొంటూ వెళ్ళాడు. '95 సిద్ధాంతాలు' గల పత్రాన్ని ఉత్తరం వైపు తలుపుమీద మేకులతో కొట్టాడు.


ఆ పత్రం లాటిన్‌లో వ్రాయబడివుంది. వెంటనే దానిని ఎవరో జర్మనీ భాషలోకి తర్జుమా చేశారు. రెండు వారాలు తిరక్కముందే లూథర్ '95 సిద్ధాంతాలు' ఐరోపా అంతట వ్యాపించాయి. ఆ పత్రం పోప్‌ను, బిషప్‌ను సవాలు చేసినట్లయింది. అదే సంఘ సంస్కరణకు నాంది పలికింది.

• • • • • • •

**లూథర్ 95 సిద్ధాంతాలను తయారు చేయడానికి ప్రధాన కారణం పాప పరిహార పత్రాలే. 95 సిద్ధాంతాలలో మూడు ముఖ్యాంశాలు ఉన్నాయి.**

**1. పాపం గురించి నిజమైన 'పశ్చాత్తాపం' లేకుండా పాప పరిహార పత్రాలు అమ్మడం:**

పాపపరిహార పత్రం అనేది 'నీ పాపాలు క్షమించబడ్డాయని' పోప్ ఇచ్చే సర్టిఫికేట్. ఇది లేఖనాలకు విరుద్ధం. అయినా తప్పులు కలిగివున్న ఈ పత్రానికి సంఘం విపరీతమైన అధికారం కల్పించింది. వీటిని విటెన్‌బర్గ్‌లో అమ్మే బాధ్యత జాన్ టెజెల్‌కు అప్పగించింది. టెజెల్ మంచి వాగ్ధాటి గలవాడు. ఆయన నరకాన్ని, నరకంలో ప్రజలు పడే ఘోరమైన బాధల్ని, పరదైసులో ఉండే శాంతి, ఆనందం గురించి కళ్ళకు కట్టినట్లు వివరించి భయం





కల్పించేవాడు. పత్రాలను అమ్ముతూ టెజెల్ ఇలా నినాదం చేసేవాడు "పెట్టెలో నాణెం టంగ్‌మని శబ్ధం చేసినప్పుడు పర్గొటరీలో ఆత్మ చెంగ్‌మని పాప విముక్తి చెందుతుంది". ఈ ప్రసంగాలు విన్న ప్రజలు భయంతో త్వరపడి పాప పరిహార పత్రాల్ని కొనేవారు. చనిపోయిన తర్వాత పర్గొటరీ (మరణం తర్వాత ఆత్మలు నివసించే మధ్యస్థితి)లో పడే బాధను తప్పించుకోవచ్చనే బోధతో ప్రజలు పాపం పట్ల నిజమైన పశ్చాత్తాపం లేకుండానే తమ బంధువులకు, స్నేహితులకు కూడా ఈ పత్రాలను కొనేవారు. ఈ పరిహార పత్రాల ఖరీదు ఒకని ఆర్థిక స్తోమతను బట్టి ఉండేది. పేదల కంటే ధనికులు ఎక్కువ చెల్లించాల్సి ఉండేది.

చేసిన పాపాలకు నిజమైన పశ్చాత్తాపం లేకుండా ధనంతో పరిహారమవ్వడం విని మార్టిన్ లూథర్ దిగ్భ్రాంతి చెందాడు. "నీతిమంతుడు విశ్వాసమూలంగా జీవిస్తాడు" (రోమా 1:17) కానీ పాప పరిహార పత్రాలు కొన్నందువల్ల కాదు అని గట్టిగా వాదించి జర్మనీలో నిరసన ఉద్యమాన్ని లేవనెత్తాడు.

పశ్చాత్తాపంతో ప్రార్థించే ప్రతివానికి యేసుక్రీస్తు ఉచితంగా పాప పరిహారం జరిగిస్తాడు, అంతేగాని పాప పరిహారం పోప్ జరిగించలేడని, పర్గొటరీపై పోపుకు ఎలాంటి అధికారం లేదని, ఒకవేళ అట్టి అధికారం పోప్‌కు ఉంటే పర్గొటరీ నుండి అందరిని వెలుపలికి తీసుకొని రావచ్చుగదా, అసలు పర్గొటరీ లేకుండా చేయవచ్చు గదా అని లూథర్ తన 95 సూత్రాలలో తెలియజేశాడు.

## 2. పరిశుద్ధ పేతురు దేవాలయం గురించి:

'పాప పరిహార పత్ర' అమ్మకంలో ధన సేకరణ అనే భావన స్పష్టంగా కన్పిస్తుంది. క్రీ.శ. 4వ శతాబ్దంలో పరిశుద్ధ పేతురు దేవాలయం నిర్మించబడింది. కాలం గడుస్తుండగా, యాజకుల అక్రమ జీవితాల వలన ఆ దేవాలయాన్ని గురించిన ఆలోచన లేకపోవడం వలన 15వ శతాబ్దం నాటికి ఆ దేవాలయం శిథిలమైపోయింది. ఇది రోమ్ నగరంలో ఉండి ఇటలీ దేశానికి చెందింది. జర్మనీ దేశానికి చెందినది కాదు. మార్టిన్ లూథర్ జర్మనీకి చెందిన వాడు. ఈ దేవాలయాన్ని బాగు చేయడానికి అవసరమైన ధనం పాప పరిహార పత్రాల అమ్మకం ద్వారా సంపాదించాలని పోప్, సంఘ కౌన్సిల్ ఉద్దేశం. ఈ దేవాలయంలో ఆనాడు సేకరించిన పరిశుద్ధుల అవశేషాలు దాచబడి ఉన్నాయని, పరిశుద్ధ పేతురు సమాధి ఆ దేవాలయంలో ఉందని, అది పరిశుద్ధమైనదని, అందువలన దానిని తిరిగి బాగుచేయాలని పోప్ ఉద్దేశం. ఆ దినాల్లో నిర్మించాల్సిన, అసంపూర్తిగా నిర్మించబడిన అనేక దేవాలయాలు ఉండగా, ఒక్క పరిశుద్ధ పేతురు దేవాలయాన్ని నిర్మించడానికి అధిక ధనం వెచ్చించడం, తప్పుడు విధానంలో ధనం సేకరించడం అజ్ఞానమని, అన్యాయమని లూథర్ తన 95 సిద్ధాంతాల్లో వెల్లడించాడు.



## 3. పేదలను, పాపులను గురించి:

లేఖనాలకు వ్యతిరేకంగా, ఉపయోగం లేని దేవాలయానికి (పరిశుద్ధుల అవశేషాలు ఉన్న దేవాలయం) ఖర్చు పెట్టే ధనాన్ని పేదలకు పంచిపెట్టే ఓ మంచి పని చేయవచ్చని లూథర్ తన 95 సిద్ధాంతాల్లో చెప్పాడు.

నిజానికి పాప పరిహార పత్రాల గురించి, ప్రశ్నించింది లూథర్ ఒక్కడే కాదు, ఎంతో మంది ప్రశ్నించారు. అయితే వారికి, లూథర్‌కు ఉన్న తేడా ఏంటంటే, 'లూథర్ కేవలం వారిలా ప్రశ్నించకుండా, లేఖనాల్లో రుజువులు చూపమని జాన్ టెజెల్‌ను డిమాండ్ చేశాడు'. అందుకనే లూథర్ 95 సిద్ధాంతాలకు అంత వేగంగా స్పందన లభించింది. కొంతమంది లూథర్ చేసిన పనిని మెచ్చుకొంటే మరికొందరు ఆయనను పోప్, సంఘ ద్వేషిగా ముద్రవేశారు.

1520 జూన్ 15న పోప్ 10వ లియో లూథర్‌ను బహిష్కరిస్తూ జాన్‌ఎక్, ఏలియాండర్ అనేవారి ద్వారా లూథర్‌కు వర్తమానాన్ని పంపాడు. లూథర్

దాన్ని తీసుకొని విటెన్‌బర్గ్ విద్యార్థుల, కొందరు ఉపాధ్యాయుల, స్థానిక ప్రజల సమక్షంలో 1520 డిసెంబర్ 10న బహిరంగంగా కాల్చివేశాడు. ఆ పని పోప్‌తో శత్రుత్వాన్ని ఇంకా పెంచింది. అయితే కొందరు పండితులు దీన్ని సంఘ సంస్కరణకు ప్రారంభం అని భావించారు. జర్మనీ దేశం ఆధునిక చరిత్ర ప్రారంభించబడిందని సంతోషించింది. కొందరు రాజులు లూథర్‌కు మద్దతు పలికారు. మరి కొందరు యుద్ధం జరుగుతుందేమోనని భయపడ్డారు. మరికొందరు యుద్ధం చేయాల్సి వస్తే లూథర్ పక్షాన ఉంటామని చెప్పారు. ఇది తెలిసిన లూథర్ సువార్త కోసం యుద్ధం చేయడం నాకిష్టం లేదు. వాక్యము చేత లోకం జయించబడాలి, వాక్యంతో సంఘం సేవ చేయాలి, ఖచ్చితంగా, వాక్యంతోనే సంఘం కట్టబడాలని లూథర్ వారితో చెప్పాడు. ఈ సమస్యను పరిష్కరించాలని రాజైన ఫ్రెడరిక్ లూథరుతో సంప్రదింపులు చేయాలని చక్రవర్తి ఛార్లెస్‌ను ఒప్పించి వర్మ్స్ నగరంలో ఒక సభను ఏర్పాటు చేశాడు.

1521 ఏప్రిల్‌లో వర్మ్స్ నగరంలో 'డైట్ ఆఫ్ వర్మ్స్' అను పార్లమెంట్ సభ ఎదుట లూథర్ హాజరయ్యాడు. దీనికి హాజరవ్వడానికి మార్టిన్ లూథర్ ఒక బండి మీద తన అనుచరులతో విటెన్‌బర్గ్ నుంచి బయలు దేరగా ప్రజలు తండోపతండాలుగా బారులు తీరి నిలబడి జేజేలు పలికారు. ఆ సన్నివేశాలు మట్టలాదివారంలా కనిపించాయి. దీంతో పోప్ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

ఏప్రిల్ 16న వర్మ్స్ నగరం చేరి 17న లూథర్ సభకు హాజరయ్యాడు. 5వ ఛార్లెస్ అధ్యక్షతన ఆ సభ జరుగుతుంది. లూథర్ రాసిన గ్రంథాలు అన్నీ ఒక బల్లపై పేర్చబడ్డాయి. చక్రవర్తి ఆ పుస్తకాలను చూసి అన్ని పుస్తకాలు లూథర్ ఎలా రాసాడని విస్తుపోయాడు. సభ మొదటి దినాన గ్రంథాలను చూపిస్తూ ఈ గ్రంథాలు రాసింది నీవేనా? అనే ప్రశ్న పోప్ అనుచరుడైన జాన్‌ఎక్ లూథరుకు వేశాడు. నేనేనని లూథర్ సమాధానమిచ్చాడు. వీటన్నిటిలోని సిద్ధాంతాలు తప్పు అని వెనక్కు తీసుకోవడానికి ఇష్టపడతావా? అని జాన్ ఎక్ మరో ప్రశ్న వేశాడు. సమాధానం ఇవ్వడానికి లూథర్ 24 గం॥ల సమయాన్ని అడుగుతాడు. ఆనాటి సభ అంతటితో ముగిసింది. ఏం జరుగుతుందో అని ఎదురు చూసిన ప్రజలకు నిరుత్సాహం కలిగింది.

లూథర్ మరుసటి రోజు సభకు హాజరయ్యాడు. ఆ రోజు ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా కనిపించాడు. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక బలాన్ని కూడగట్టుకున్నాడు. దేవుడు తనకు తోడుగా ఉన్నట్లు గ్రహించాడు. జాన్‌ఎక్ నుంచి మరలా అవే ప్రశ్నలు. ఇవన్నీ లేఖనాలకు అనుగుణంగా వ్రాయబడినట్లు చెప్పి "ఈ గ్రంథాలు లేఖనాలకు వ్యతిరేకమైనవని తేల్చినా లేక సరైన హేతువుతో చెప్పినా నేను తప్పక ఈ గ్రంథాలను వెనక్కు తీసుకుంటాను, వీటిలో ఏ ఒక్క పొల్లయిననూ నేను నిరాకరించను, నా మనస్సాక్షికి, దేవుని వాక్యానికి వ్యతిరేకంగా ఏమీ చేయలేను. దేవుడు నాకు తోడై ఉండును గాక! 'హియర్ ఐ స్టాండ్' అని కూర్చున్నాడు.




ప్రాణాన్ని ఫణంగా పెట్టి అతడు పలికిన ప్రతి మాట సత్యాన్ని వినిపించింది. 'హియర్ ఐ స్టాండ్' ప్రపంచమంతా ప్రతిధ్వనించింది. జీవచ్ఛవంలా ఉన్న క్రైస్తవ్యం కొత్త సత్తువ తెచ్చుకొంది. రోమన్ క్యాథలిక్ పోప్‌ల సామ్రాజ్యపు ఇనుప ప్రాకారాన్ని కూలద్రోసి ప్రొటెస్టంట్ ఉద్యమానికి నాంది పలికింది.

మార్టిన్ లూథర్ సాహస విశ్వాసి మరియు అలుపెరుగని గొప్ప సంస్కర్తగా ఎదగడానికి రెండే రెండు ప్రధాన కారణాలు: ఒకటి పరిశుద్ధ గ్రంథం, రెండు ప్రార్థన. దేవుని వాక్యాన్ని అధికంగా ధ్యానించేవాడు. దానిని ప్రజలలోకి తీసుకెళ్ళడానికి తన ప్రాణాన్ని సైతం లెక్క చేయలేదు. మార్టిన్ లూథర్ పని అధికంగా ఉన్నప్పుడు తక్కువ నిద్రపోతూ ఎక్కువ సమయం ప్రార్థనలో గడిపేవాడు. లూథర్ స్నేహితుడు మెలాంక్తన్, లూథర్ గురించి ఇలా చెప్పేవాడు. "ఒక చిన్న రొట్టె, మాంసపు ముక్కతో రోజంతా ఎలా జీవించగలుగుతున్నాడో! అంత మాత్రమే కాదు వరుసగా నాలుగు రోజులు కఠిన ఉపవాసం చేస్తాడు". ఈ మాటలతో మార్టిన్ లూథర్ సాహస విశ్వాసానికి రహస్యమేమిటో అర్థమవుతుంది. ఈ సాహస విశ్వాసి జీవితం ప్రతి ఒక్కరినీ సవాలు చేయునుగాక!

– విజె డెస్క్

డివోషన్



# ఎవరి సంబంధులం? దేవుని? దుష్టుని?

ఓ అభాగ్యురాలు ఒంటరిగా వీధిలో ఉండడం రక్షణ సైన్యం సేవకుల్లో ఒకరు చూచి సహాయం చేయడానికి చర్చ్‌కి రమ్మని పిలిచాడు. అయితే ఆ అమ్మాయి అక్కడి నుండి కదలడానికి ఇష్టపడలేదు. అప్పుడాయన నీకు కావాల్సిన సహాయం చేస్తాము. దేవుడు నిన్ను ప్రేమిస్తున్నాడు, నీకోసం ఆయన మరణించాడని ఆ సేవకుడు ఎంత నచ్చజెప్పినా, ప్రయత్నించినా ఆ స్త్రీ అక్కడ నుండి కదలలేదు. కొంతసేపటి తర్వాత, ఆ దైవ సేవకుడు కిందకు వంగి ఆమె చెక్కిళ్ళ మీద ముద్దు పెట్టి, ఆమెను చేరదీయగా, ఆ అమ్మాయి వలవలా ఏడ్వడం ప్రారంభించింది. తర్వాత తనతో చర్చ్‌కి రావడం, క్రీస్తునందు విశ్వాసం ఉంచడం జరిగింది. ఓ రోజు ఆమె సేవకుడితో ఇలా చెప్పింది “దేవుడు నన్ను ప్రేమిస్తున్నాడని మీరు చెప్పారు కదా, అయితే మీరు చూపించిన ప్రేమ తర్వాతే దేవుడు నన్ను ప్రేమిస్తున్నాడని రక్షణ పొందాలని అర్థమైంది.

మనం క్రీస్తునందు నిలిచి ఉంటే, ఆయన ప్రేమలో కూడా నిలిచి ఉంటాం. ఆయన ప్రేమలో నిలిచి ఉంటే, ఆయన ప్రేమను ఇతరులతో పంచుకొంటాం. మనం దేవుని ప్రేమను ఎప్పుడైతే ఇతరులతో పంచుకొంటామో అదే మనం క్రీస్తులో నిలిచి ఉన్నామని అనడానికి రుజువు. విశ్వాసి అంతరంగ జీవితానికి, బాహ్య జీవితానికి ఎలాంటి తేడా ఉండదు. మనం దేవునిని ఎంతగా ప్రేమిస్తే అంతగా మనం దేవుని ప్రేమను అర్థం చేసుకొంటాం, ఆయనను నమ్మడం సులభమవుతుంది. ఎవరైనా ఒక వ్యక్తిని సన్నిహితంగా ఎరిగి, నిజాయితీగా ప్రేమిస్తే ఆ వ్యక్తిపై నమ్మకం ఉంచడానికి సంకోచించము. దేవుడు తన పిల్లల ద్వారా తన్ను తాను వెల్లడిపరచుకొంటాడు, మనుషులు దేవున్ని చూడలేరు గాని మనల్ని చూడ గలరు. మనం ఆయనలో నిలిచి ఉంటే ఒకరినొకరం ప్రేమించుకొంటాం. మనం దేవుని సంబంధుల మైతే ఒక్కనిొకరము ప్రేమింతుము (1 యోహాను 4:7). ప్రేమించు ప్రతివాడును దేవుని మూలంగా పుట్టినవాడై దేవుని ఎరుగును.

ప్రేమింపని ప్రతివాడును దేవుని సంబంధులు కారు. మనం ఒకనినొకరము ప్రేమింపవలెననేది దేవుని ఆజ్ఞ. అయితే మనం కయీను వంటి వారమై ఉండరాదు వాడు దుష్టుని సంబంధి (1 యోహాను 3:12). అంటే దేవుని ప్రేమ లేకపోవడం. దేవుని ప్రేమ లేకపోతే ఎవరైనా దుష్టుని సంబంధులే. దేవుడు ఆత్మ (యోహాను 4:24). అంటే కేవలం రక్త మాంసం కాదు. దేవుడు వెలుగు (1యోహాను 1:5) అంటే ఆయన పవిత్ర స్వభావాన్ని సూచిస్తుంది. దేవుడు పరిశుద్ధుడు గనుక ఆయన పాపం చేయడు. మనం ఆయన కుటుంబంలోకి తిరిగి జన్మించాం, గనుక ఆయన పరిశుద్ధ స్వభావం పొందాం (2 పేతురు 1:4; 1 పేతురు 1:14-16). దేవుడు ప్రేమ (1 యోహాను 4:7), వెలుగు. అందువలన ఆయన ప్రేమ పవిత్రమైనది, ఆయన పవిత్రత ప్రేమలో వ్యక్తం చేయబడింది. దేవుడు చేసినదంతా దేవుని వెల్లడిస్తుంది. మనకు దేవునితో వ్యక్తిగత సంబంధం ఉందని చెప్పుకుంటే మన జీవనశైలి ద్వారా ఆయన ప్రేమను ప్రతిబింబించాలి. దేవుడు ప్రేమ

గనుక దేవుని పిల్లలుగా (విశ్వాసులుగా) ప్రేమను కనబరచాలి. ఇందులోని తర్కం తిరుగులేనిది. దేవుని ఎరగడం అంటే ఆయనతో సన్నిహిత సంబంధం కలిగి, ఆయన జీవాన్ని పొంది, ఆయన ప్రేమలో ఆనందించడం. దేవుడు ఏమై ఉన్నాడు అనే విషయం మనం ఏమై ఉండాలో నిర్ధారిస్తుంది. ఆయన ఎట్టివాడై ఉన్నాడో మనము కూడా ఈ లోకంలో అట్టివారమై ఉన్నాము (1 యోహాను 4:17). మనం దేవునితో సహవాసం కలిగి ఉన్నందున, ఆయన కుమారులైన నందున ఒకరినొకడు ప్రేమింప బద్ధుల మై ఉన్నామనేది నిర్వివాదాంశము.

ప్రేమ ఆజ్ఞగా ప్రారంభమై, అధికృతగా మారుతుంది. ప్రేమ అనేది మనం విధిగా చేసేది కాదు తప్పక చేయాలనుకొనేది. దేవుని పిల్లల జీవితాలలో దేవుని ప్రేమ పని చేయడం చూసేవరకు దేవుడు పాపులను ప్రేమిస్తాడని లోకం నమ్మదు.

దేవుడు తన అర్పణను తిరస్కరించిన కారణాన తన సహోదరుడైన 'హేబెలు'పై కోపము, అసూయ పెంచుకొని నరహంతకునిగా మారిన కయీను వలే మనం ఉండకూడదు. వాడు దుష్టుని సంబంధి అని యోహాను భక్తుడు చెప్పడం గమనార్హం. బహుశా స్వార్థం, ద్వేషం, అతిశయం, దేవునియందు నమ్మకం లేకపోవడం, చాలా కోపం, నిగ్రహం లేకపోవడం, ముఖం చిన్నబుచ్చుకోవడం, చివరకు దుష్కార్యానికి పాల్పడడం కయీను జీవితంలో చూడగలం. అతని అవిశ్వాసం కారణాన, తనపై తాను ఆధారపడడం వలన దేవుడు తనని, తన అర్పణను అంగీకరించలేదని భావించవచ్చు. హేబెలు అర్పణ అతని హృదయ పరిస్థితిని, దేవుని పట్ల ప్రేమను, గౌరవాన్ని, దేవుని మాట, వాగ్దానాల ను నమ్మడం ద్వారా దేవుడు అతని అర్పణను లక్ష్య పెట్టాడు (ఆది 4:4).

1. కయీను అర్పణ దేవునికి అయిష్టమైనది. తద్వారా అది అతని అనైతిక, అక్రమ ప్రవర్తనకు దారి తీసింది.
2. కయీను అక్రమ ప్రవర్తన సమాజానితో ఎడబాటు తెచ్చింది.
3 ఆ ఎడబాటు కయీనుని దేవుని నుంచి దూరంగా వెళ్ళేలా చేసింది.
4. దేవుని నుంచి దూరంగా వెళ్ళిపోవడం వలన క్షీణించిన వయసుకు, సంఘర్షణకు, కరువుకు, అశాంతికి దారితీసింది.

మనము ప్రియులైన పిల్లలు వలె దేవుని పోలి నడుచుకోవాలని సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సమస్తమైన దుష్టత్వం విసర్జించాలని, ఒకని యెడల ఒకడు దయ కలిగి, కరుణా హృదయులై క్రీస్తు నందు దేవుడు మనల ను క్షమించిన ప్రకారము మనము ఒకనినొకరు క్షమించాలని పౌలు గారు ఎఫెసీలోనున్న పరి శుద్ధులకు తెలియజేశాడు. 'కోపపడుడి గాని పాపం చేయకుడి' అని హెచ్చరించాడు.

కొంతమందికి అప్పటికప్పుడే ఆకస్మికంగా కోపం వస్తుంది. అది ఒక్కొక్కసారి కలహాలకు, అనారోగ్యానికి దారితీస్తుంది. 'నీ కోపాన్ని నీవు నియంత్రించుకోకపోతే అది నిన్ను చంపేస్తుంది' అన్నాడొక వ్యక్తి. దేవుడు పాపాన్ని బట్టి కోప్పడతాడు, గానీ మనల్ని ప్రేమిస్తాడు. ఆత్మీయ సంబంధమైన కోపం వ్యక్తిగతమైనది కాదు, ప్రతీకారం తీర్చుకొనేది కాదు, నిరంతరం ఉండేది కాదు (యోహాను2:14-17). మానవుని కోపం దేవుని నీతిని నెరవేర్చదు (యాకోబు1:20). మనం చేసేది ఏదైనా దేవునికి అంగీకారం కానప్పుడు

1. మనం చేసిన దానికి పశ్చాత్తాపడాలి, దైవిక విధానంలో చేయాలి లేదా
2. దేవునిపై కోపపడి మనకు నచ్చినట్లు, మన ఇష్టమే జరిగించాలి.

ఆవేశం, అతిశయం, అపవిత్రతల నుండి విడిపించబడాలి. ఆవేశానికి మందు బలిపీఠం దగ్గర ఉంటుంది (మత్తయి 5: 24). మనం సమాధానపడితే ఆయన నామము హెచ్చించబడుతుంది. మనుషుల అపరాధములను క్షమించగలిగితే మన పరలోకపు తండ్రి మన అపరాధములను క్షమిస్తాడు (మత్తయి 6:14,15). ఇతరులు ఆవేశపడితే, అతిశయపడితే, అపవిత్రతకు ప్రేరేపిస్తే మనం ఎలా స్పందిస్తామో ఆయనతో గల సన్నిహిత సంబంధం పై ఆధారపడి ఉంటుంది. అదే దేవుని ప్రేమలో నిలిచి ఉండడానికి, మనం ఒకరినొకరం ప్రేమించుకోవడానికి దోహదపడుతుంది. అంతేకాదు క్రీస్తు వెలుగును ప్రతిఫలించుట ద్వారా మన పరలోకపు తండ్రికి గౌరవాన్ని ఇవ్వగలం.

**– డా. వి. ఇశ్రాయేలురాజు,** వైజాగ్

# సంబంధాలు



క్రైస్తవ్యమంటేనే వివిధ సత్సంబంధాల సమ్మేళనము. ఈ సంబంధాలు ప్రధానంగా రెండు రకాలు. మొదటిది దేవునికి ఒక విశ్వాసికి ఉండే సంబంధం. రెండవది విశ్వాసికి తోటి మానవులతో ఉండే సంబంధం. వాక్యానుసారముగా ఈ రెండూ అత్యవసరమే. యేసుప్రభువు భూమి మీద ఉన్నప్పుడు ఈ రెండు సంబంధాలతో వర్ధిల్లారు (లూకా 2:52). వ్యక్తిగత, సంఘపరమైన అన్ని సంబంధాలకూ ఆయనే మన ప్రధాన మాదిరి. ఇయు పరిచర్యలో విద్యార్థినీ, విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్, స్టాఫ్ వర్కర్స్, గృహము, సేవాస్థలము, సంఘము మొదలగు వారి/వాటి మధ్య మన సంబంధాలు కీలకమైనవి. దేవుని పిల్లలు అందరితో సత్సంబంధాలు కలిగి సమాధానంగా ఉండాలని దేవుని వాక్యం హెచ్చరి స్తుంది (రోమా 12:18).

## విశ్వాసులైన విద్యార్థినీ విద్యార్థుల మధ్య సంబంధాలు

విద్యార్థుల కోసం, విద్యార్థుల మధ్య, విద్యార్థుల ద్వారా నిర్వహించబడుతున్న సౌవార్తిక ఉద్యమమే యుఇయస్ఐ. ఏ ఉద్యమమైనా రాణించాలంటే ఆ సభ్యుల మధ్య సత్సంబంధాలు, సదవగాహన ఎంతో అవసరం. విశ్వాసులైన విద్యార్థుల మధ్య మంచి సంబంధ బాంధవ్యాలు ఉండడం అది వారి క్షేమాభివృద్ధికి, ఉద్యమ పురోభివృద్ధికి అనివార్యం. ఇందుకు తోడ్పడే కొన్ని ముఖ్యమైన అంశాలను గమనిద్దాం.

క్రమమైన వ్యక్తిగత మౌనధ్యాన సమయాలు ఒకవైపు ఉంటూనే సామూహిక సహవాసం, ప్రార్థన, వాక్య ధ్యానాలు ఎడతెగకుండా కలిగి ఉండాలి. ఇది ఒకవైపు దేవునితోను, మరొక వైపు తోటి విశ్వాసులతోను మన సంబంధాలు సంతుష్టిసహితంగా ఉంచడానికి దోహదపడుతుంది (హెబ్రీ 10:24).

భయముతోను, వణుకుతోను ఎవరి రక్షణను వారు కాపాడుకొంటూ ఒకరికంటే మరొకరు ఘనముగా ఎంచి, సహోదర ప్రేమ కలిగియుండుటకు సాధకం చేయాలి (రోమా 12:10).

ఎవరి తలాంతులను వారు సాధన చేస్తూ అందరం కలసి కళాశాలలో మంచి సాక్ష్యం స్థాపించే గురి కలిగి ఉండాలే కాని ఏ విషయంలోనూ ఒకరిపై ఒకరు అసూయ పడకూడదు (రోమా 12:6-8). దావీదుపై రాజైన సౌలు అసూయపడి ఎన్ని ఇక్కట్లు తెచ్చుకొన్నాడో మనకు తెలుసుకదా! దేవుడు సౌలును బట్టి చింతించాడు కూడా.

ఇయు కార్యక్రమాలకు ప్రణాళికలు తయారు చేసేటప్పుడు, వాటిని నిర్వహించేటప్పుడు విశ్వాసుల మధ్య ఏకమనసు, ఏక ప్రేమ, ఏక భావం కలిగి ఉండడం అవసరం. యేసుక్రీస్తుకు కలిగిన మనసు మనమూ కలిగియుండుట ద్వారా ఇది సాధ్యమౌతుంది (ఫిలిప్పీ 2:1-4).

ఒకరిపై ఒకరు లేనిపోని వార్తలు పుట్టించడం, ఒకరు లేని సమయంలో కథలు అల్లడం మాని ముఖాముఖిగా కలసి అనుమానాలను, సమస్యలను పరిష్కరించుకొంటూ క్షమించుటకు సిద్ధమైన మనస్సు కలిగియుండాలి (ఎఫెసీ 4:32).

విద్య, ఆర్థిక, ఆత్మీయ తదితర రంగాలలో మెరుగుగా ఉన్న విశ్వాసులు వాటి అవసరతలో ఉన్న సాటి విశ్వాసులకు సాధ్యమైనంత వరకు సహాయపడాలి.

ఇతరులకు అభ్యంతరం కలగకుండా ఉండాలంటే సహవాసము, పరిచర్యలకు సంబంధించి విద్యార్థులు విద్యార్థులతోను, విద్యార్థినీలు విద్యార్థినీలతోను

సంబంధం కలిగి ఉండడం మంచిది. అలాగే పవిత్ర జీవితాన్ని జీవించాలి.

## విశ్వాసులైన గ్రాడ్యుయేట్స్ మధ్య సంబంధాలు

విద్యార్థినీ, విద్యార్థులు సమాజాన్ని, కళాశాలలను, తమ పరిసర ప్రాంతాలను ప్రభావితం చేసే సత్తా కలిగినవారు. అలాంటి ప్రతిభావంతులైన విద్యార్థి వర్గానికి సువార్తను అందించి, వారి ఆత్మీయ, భౌతిక అవసరాలను తీర్చడానికి దేవుడు గ్రాడ్యుయేట్స్‌కు చక్కటి సదవకాశాన్ని ఇచ్చాడు. గ్రాడ్యుయేట్స్ మధ్య సంబంధాలు పారదర్శకత కలిగియుండాలి. అంతర్గత విబేధాల వల్ల సాక్ష్యం దెబ్బతిని పనికి అంతరాయం కలుగుతుంది. సంబంధాలు కాపాడుకోవడంలో అవసరమయితే మెటీరియల్ గాని, సొమ్ము గాని నష్టపోవడానికి ఇష్టపడాలి. డబ్బు కంటే సంబంధాలు ముఖ్యం. పరిచర్యను ప్రభావితం చేసే విషయాలను గ్రాడ్యుయేట్స్ ఒకరికొకరు తెలుపుకొంటూ, వాటిని సాధించడానికి సమైక్యంగా కృషి చేయాలి. గ్రాడ్యుయేట్ల నిస్వార్థంగా, త్యాగపూరితంగా చేసే సేవ అనేకమంది విద్యార్థినీ, విద్యార్థులకు ఆదర్శప్రాయంగా నిలుస్తుంది. సీనియర్ గ్రాడ్యుయేట్స్ యంగ్ గ్రాడ్యుయేట్స్‌కు తర్ఫీదు ఇస్తూ వారిని పరిచర్యలో పాలుపొందేటట్లు ప్రోత్సహించాలి.

## విద్యార్థులు-గ్రాడ్యుయేట్స్ మధ్య సంబంధాలు

ఇయు పరిచర్యలో గ్రాడ్యుయేట్స్ విద్యార్థుల మధ్య సంబంధం పౌలు, తిమోతిల సంబంధం లాంటిది. పౌలు తిమోతిని ఆత్మీయంగా కని, పెంచి ఒక సంఘానికి బాధ్యత గల వ్యక్తిగా ఎలా తయారు చేశాడో గ్రాడ్యుయేట్స్ కూడా అదే మాదిరి, శ్రద్ధ విద్యార్థుల పట్ల చూపించాలి. విద్యార్థులతో గ్రాడ్యుయేట్స్ సంబంధాలు బహు కీలకమైనవి, సున్నితమైనవి మరియు బాధ్యతాయుతమైనవి.

వ్యక్తిగత మరియు పరిచర్యకు సంబంధించిన వ్యవహారాలలో విద్యార్థుల స్వేచ్ఛకు భంగం కలుగకుండా, పట్టీపట్టని ధోరణిలో వ్యవహరించకుండా గ్రాడ్యుయేట్స్ జాగ్రత్త పడాలి.

విద్యార్థుల సమంజసమైన సమస్యల పరిష్కారానికి గ్రాడ్యుయేట్స్ అందుబాటులో ఉంటూ తమ ఇంటిని, వనరులను పరిచర్యకు తెరచి ఉంచడం వారి మధ్య చెరిగిపోని సంబంధాన్ని ఏర్పరుస్తుంది.

అత్యవసర సమయాల్లో విద్యార్థులకు గ్రాడ్యుయేట్స్ చేసే ఆర్థిక సహాయం, వారి ఇబ్బందులలో పరామర్శ, సమయానుకూలమైన ఒక గద్దింపు లేదా మెచ్చుకోలు, దాపరికంలేని స్వభావం ఇవన్నీ విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ మధ్య అంతరాన్ని తొలగించి విద్యార్థులకు కావలసిన ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఇస్తాయి.

మన సహవాసాలలో చాలామంది విద్యార్థినీ విద్యార్థులు కొంతమంది గ్రాడ్యుయేట్స్‌ను మాదిరిగా తీసుకొని వారిని అనుకరిస్తుంటారనేది వాస్తవం. అదే సమయంలో విద్యార్థులు కూడా గ్రాడ్యుయేట్స్ పట్ల జాగరూకతతో మెలగాలి. అవసరతకు మించి గ్రాడ్యుయేట్స్‌పై ఆధారపడకూడదు. అవసరం లేకపోయినా గ్రాడ్యుయేట్స్ ఇళ్ళకు వెళ్ళి వారి సమయాన్ని వృథా చేయడం, చనువుగా వారి వనరులను తరచూ స్వంతానికి ఉపయోగించడం మొదలగు పనులు అభ్యంతరకరమైనవి.

విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ మధ్య సంబంధాలు ఇలా ఉండాలని కొన్ని నిర్దేశాలు తయారు చేసుకోవడం మంచిదే కానీ వ్యక్తులను బట్టి, సందర్భాన్ని బట్టి సమయోచిత నిర్ణయాలు తీసుకోవడంలోనూ, వాటిని అమలు చేయడంలోనూ ఈ సత్సంబంధాలు కొనసాగేవిగా ఉంటాయి. దీనికి పరిశుద్ధాత్మ దేవుని వివేచన, విషయ పరిజ్ఞానము మనకు అవసరము.

## స్టాఫ్ వర్కర్స్‌తో సంబంధాలు

ఇయు పరిచర్యకు గ్రాడ్యుయేట్స్ మాత్రమే కాక స్టాఫ్ వర్కర్స్ కూడా దేవుడిచ్చిన ప్రత్యేక బహుమానాలు. విద్యార్థుల మధ్య సేవకు సంపూర్ణంగా అంకితమైన గ్రాడ్యుయేట్సే స్టాఫ్ వర్కర్స్. అప్పుడప్పుడూ విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్, స్టాఫ్ వర్కర్స్ మధ్య అభిప్రాయ భేదాలు ఏర్పడవచ్చు. 'నా మాటే నెగ్గాలి' అన్న ధోరణి కూడా కనబడవచ్చు. టీమ్‌గా పని చేసేటప్పుడు ఇవన్నీ అనివార్యాలు. అయితే ప్రతివారూ తమతమ పరిధిలో పనిచేస్తూ దేవుని రాజ్య విలువలను సమన్వయ పరచుకొంటూ పరిచర్య విస్తరణలో సాగిపోవాలి. ఇందులో ఒకరు ఎక్కువ మరొకరు తక్కువ అన్న తలంపుకు అవకాశమే లేదు. అందరూ దేవుని తోటలో వేరువేరు బాధ్యతలు నిర్వహించేవారు మాత్రమే. నాటే వారూ కావాలి, నీరు పోసే వారూ కావాలి. అయితే వృద్ధి కలగచేసేది దేవుడే అన్న విషయం మన పరిచర్యలో

జ్ఞాపకముంచుకోవాలి. పౌలు ఆయా సంఘాలలో పెద్దలు, విశ్వాసులతో మెలిగిన తీరు మరియు విశ్వాసులు పౌలుపట్ల ప్రవర్తించిన విధానం ఈ విషయాలలో మనకు మాదిరిగా ఉన్నాయి.

## సంఘంతో సంబంధాలు

యుఇయస్ఐ స్వాభావికంగా ఒక 'ఇంటర్ డినామినేషనల్' సంస్థ. ఇయు, ఇజియఫ్‌లు క్రైస్తవ సంఘము దాని అనుబంధ సంస్థలతో సుహృద్భావ ధోరణి కలిగివుంటాయి. ప్రాంతీయంగా, జాతీయంగా పలు ప్రధాన సంఘాలు ఈ విషయాన్ని ఇప్పటికే గమనించాయి. యుఇయస్ఐ నేడు జాతీయ స్థాయిలో క్రైస్తవ సంఘానికి, సంస్థలకు అనేకమంది నాయకులను అందించగలిగింది అన్నది కాదనలేని వాస్తవం. ఇయు, ఇజియఫ్ సభ్యులు డినామినేషన్‌కు అతీతంగా ఆయా స్థానిక సంఘాలలో చురుకైన పాత్ర పోషించడం తెలిసిన సత్యమే. అయి నా కొన్ని స్థానిక సంఘాలు ఇయు పరిచర్యను ఇంకా విశదంగా అర్థం చేసుకోవలసిన అవసరత లేకపోలేదు. ఇయు సభ్యులు సంఘ కార్యక్రమాలకు తగిన ప్రాముఖ్యత ఇవ్వడం లేదనేది ఒక ఫిర్యాదు. సంఘాలకు అభ్యంతరకరంగా ఉండే ఇలాంటి పరి స్థితులను స్థానిక ఇయు, ఇజియఫ్ విశ్వాసులు సరిచేసుకోవాల్సిన అవసరత ఎంతైనా ఉంది.

## కుటుంబంలో సంబంధాలు

క్రైస్తవ గృహం భూమి మీదనున్న ఒక చిన్న 'పరలోకం', ఇది దేవుని ఆలోచన. అన్ని రకాల సత్సంబంధాలకు కుటుంబమే ప్రాథమిక నిలయం. భార్యాబిడ్డలు, తల్లి, తండ్రి, సోదర సోదరీలు తదితరులతో సరైన సంబంధాలు నెలకొల్పలేని ఏ వ్యక్తి అయినా సమాజంలో గానీ, పరిచర్యలో గానీ, ఆరోగ్యకరమైన సంబంధ బాంధవ్యాలను స్థాపించలేడు. పరలోకపు ఉద్దేశాలు భూమిమీద నెరవేరడానికి దేవుడు వాడుకొనే వ్యూహాత్మక స్థానాలే క్రైస్తవ గృహాలు. 'ఇంట గెలిచి రచ్చ గెలవాలి' అన్న సామెత మన సంబంధాల విషయంలోనూ వర్తిస్తుంది. కుటుంబంలో ఒకరి మధ్య ఒకరి కి ఉండవలసిన సంబంధాలను గూర్చి బైబిల్ పలుచోట్ల ప్రస్తావించింది. భార్యాభర్తల మధ్య సంబంధం, ప్రభువుకు క్రైస్తవ సంఘానికి మధ్యనున్న సంబంధంతో పోల్చబడింది. విశ్వాసులైన విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ తమ తల్లిదండ్రులను అలక్ష్యం చేయక గౌరవించాలి, సన్మానించాలి. అవిశ్వాసులైన తల్లిదండ్రులుంటే మరింత శ్రద్ధ వహించాలి. ఇలాంటి మంచి సంబంధాలతో అల్లుకొన్న మన కుటుంబాల ద్వారాలు పరిచర్యకు తెరచినట్లయితే అద్భుతాలు జరగకుండా ఎలా ఉండగలవు?

## ఇతరులతో సంబంధాలు

విశ్వాసులైన యుఇయస్ఐ సభ్యులు ఇతరులతో సత్సంబంధాలు కలిగి ఉండటం ద్వారా వారి సాక్ష్య ప్రభావాన్ని చూపగలరు. "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకపు దేవుని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనీయుడి" (మత్తయి 5:16) అన్న యేసు మాటలు గమనించదగినవి. విశ్వాసులు ప్రభువు నామమును బట్టి నిందలు, హింసలు పొందితే ఆ నామమును బట్టియే వారు ఆనందముతో సహించాలి (మత్తయి 5:11,12). అవిశ్వాసియైన అధికారి దగ్గర ఒక విశ్వాసి విధేయత, మంచి సాక్ష్యము కలిగి క్రీస్తును ప్రతిబింబింపచేయాలి (1పేతురు 2:10). కొన్ని కొన్ని సున్నితాంశాల విషయంలో పాము వలె వివేకము కలిగి, పావురము వలె నిష్కపటముతో స్పందించాలి (మత్తయి 10:16). యేసు ప్రభుని ప్రేమ, సహనం, కనికరము మన మాటలు, చేతలలో ప్రజలు గమనించగల్గిన నాడు తగిన సమయంలో వారు దేవుని వైపు ఆకర్షింపబడతారు.

## ముగింపు

యుఇయస్ఐలోని ప్రతి ఒక్కరూ తమతమ రంగాలలో బాధ్యతాయుతమైన, పరిణితి చెందిన సత్సంబంధాలు నెలకొల్పుతూ తాము ప్రాతినిధ్యం వహిస్తున్న స్టూడెంట్స్ ఉద్యమాన్ని ప్రభువు మహిమార్థం వ్యాపింప చేయాలి. ఇది మన దర్శనం, భాగ్యము, బాధ్యత. యుఇయస్ఐ సహవాసం దర్శనము కలిగిన కొద్దిమందితో ప్రారంభమై నేడు అంచెలంచెలుగా ఎదిగి మహా ఉద్యమం అయ్యింది. దీనిలో స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్, స్టాఫ్ వర్కర్స్ అందరూ భాగస్వాములే. ఈ సహవాసం లోపల, బయట ఆధ్యాత్మిక విలువలతో కూడుకొన్న సంబంధాలు వృద్ధి చెందిననాడు విస్తారమైన పంట కోయగలమన్న వాస్తవం గతానుభవం, ప్రస్తుత ప్రధాన కర్తవ్యం అయివున్నాయి.

– కె. యోహాన్, తుని



# హార్డ్ వర్క్ @ కెరీర్

"మనస్ఫూర్తిగా పని చేయలేని వారు జీవితంలో విజయాన్ని సాధించలేరు" అని అంటారు ఎ.పి.జె. అబ్దుల్ కలాం. అది పరిచర్యలోనైనా లేదా మన కెరీర్లోనైనా కావచ్చు. అనుకున్నది సాధించాలంటే అనుక్షణం శ్రమించాల్సిందే. శ్రద్ధగా పని చేయువారు ఏలుబడి చేయుదురు (సామె 12:24). ఇ.యు. విద్యార్థిగా నీకు రెండు బాధ్యతలు ఉన్నాయి. ఒకటి చదువులో రాణించి ఉద్యోగంలో స్థిరపడాలి. రెండవది పరిచర్యలో పాల్గొనాలి. కాబట్టి ఈ రెండింటి మధ్య సమతూకం చాలా అవసరం. చదువుకి ప్రాముఖ్యతనిచ్చి దేవునిని ప్రక్కన బెడితే దేవుని ఆశీర్వాదాలను పోగొట్టుకొంటాం. ఒకవేళ పరిచర్యకి ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చి చదువును, కెరీర్‌ను నిర్లక్ష్యపెడితే ఫెయిల్యూర్ వస్తుంది. ఈ ఆర్టికల్ మొత్తం చదివిన తర్వాత మీ కెరీర్ కట్టుకోవడానికి ఎంత కష్టపడుతున్నారో? మీరు ఎంత సమతూకాన్ని కలిగివున్నారో ఒక్కసారి ఆలోచన చేయండి.

ఈ మధ్య కాలంలో నేను కొంతమంది గ్రాడ్యుయేట్స్‌తో మాట్లాడినప్పుడు వారి నుండి వచ్చిన స్పందన ఏంటంటే, మనవాళ్ళు కార్పొరేట్ ఉద్యోగాలు చేయడానికి పనికిరారు. చాలా మంది విద్యను పూర్తి చేసుకొని కూడా ఖాళీగా ఉంటున్నారు. మనవాళ్ళు కొన్ని ఉద్యోగాలకే పరిమితం అయిపోయారు. చిన్న చిన్న ఉద్యోగాలతో సరిపెట్టుకొనే పరిస్థితులు ఎందుకు? కాలం మారుతుంది, పరిస్థితులు మారుతున్నాయి. కానీ మన ఇయు విద్యార్థులలో ఎక్కువ మందిలో మార్పు రావడం లేదు.

దేవుని పిల్లలంగా మనం కాలంతో పాటు పోటీ పడలేమా? ఎందుకు మనం కష్టపడలేకపోతున్నాం? నీవు అనుకోవచ్చు నేను మంచి బ్యాక్ గ్రౌండ్ నుండి రాలేదు, మేము చాలా పేదవాళ్ళం, తెలుగు మీడియంలో చదివాను, మా అమ్మనాన్న చదువుకోలేదు... ఇలా కారణాలు ఎన్నైనా చెప్పవచ్చు. కానీ మన దేవునికి అసాధ్యమైనది ఏదీలేదు. కొలస్సీ 3:23-24 ప్రకారం మనం ఏది చేసినా ప్రభువుకొరకు మనస్ఫూర్తిగా చేయాలని దేవుడు కోరుకొంటున్నారు. 6 సం॥లు కష్టపడితే 60 సంవత్సరాలు నీవు సుఖంగా ఉంటావు. నీ చదువు పూర్తి అయిన తరువాత ఒక గ్రాడ్యుయేట్ అన్న దగ్గరకు వెళ్ళి నాకు పెళ్ళి సంబంధం చూడమంటే, వారు అడిగే మొట్టమొదటి ప్రశ్న నీవు ఏమి ఉద్యోగం చేస్తున్నావు?

అంటే నీవు కుటుంబాన్ని పోషించగలవా? లేదా? అని ఆలోచిస్తారు. మనలో ఎక్కువ మంది చదువు పూర్తయ్యాక ఉద్యోగం గురించి ఆలోచిస్తారు. కానీ నీవు విద్యార్థిగా వున్నప్పుడే నీకు జీవిత ప్రణాళిక అవసరం. వీటన్నింటిని బట్టి ఆలోచన చేస్తే మన విద్యార్థులలో చాలా మందికి ఎన్నో విషయాల మీద అవగాహన లేదు. కష్టపడడానికి ఇష్టపడడం లేదనిపిస్తుంది. “తన పనిలో నిపుణత గలవానిని చూచితివా? వాడు అల్పులైన వారి ఎదుట కాదు రాజుల ఎదుటనే నిలబడును” (సామె 22:29). ఈ ప్రపంచానికి ఎక్కువ నూతన ఆవిష్కరణలు ఇచ్చింది క్రైస్తవ శాస్త్రవేత్తలే. దానికి కారణం వారు అహర్నిశలు పట్టుదలతో శ్రమించారు. దేవుడు ఆ కష్టాన్ని ఆశీర్వాదకరంగా మారుస్తున్నాడు. మరి నీవు?

## కష్టపడడానికి మన ఇయు విద్యార్థుల ముందున్న కొన్ని సవాళ్ళు

**1. భాషా నైపుణ్యాలు:** “దేశ భాషలందు తెలుగు లెస్స” అన్నప్పటికీ తెలుగులో అద్భుతంగా మాట్లాడితే ఉద్యోగాలు రావు. నీ ఆన్‌లైన్ పరీక్షల దగ్గర నుండి ఇంటర్వ్యూల వరకు అన్నీ ఇంగ్లీష్‌తోనే ముడి పడివుంటాయి. ప్రస్తుత పరిస్థితులలో కార్పొరేట్ వ్యవస్థలో మనం ఫిట్ అవ్వకపోవడానికి ఇదొక ప్రధాన కారణం. నేను  తెలుగు మీడియం నుండి వచ్చాను. నాకు ఇంగ్లీష్ రాదు అని సానుభూతి మాటలు మాట్లాడకూడదు.

దానియేలు, షద్రక్, మేషక్, అబెద్నగోలు పరాయి దేశంలో బానిసలుగా ఉండి పర భాషలో ప్రావీణ్యాన్ని సంపాదించారు. దానికి కారణం వారు దేవుని కొరకు కష్టపడడానికి ఇష్టపడ్డారు. కాబట్టి దేవుడు వారికి సహాయం చేశాడు. దానియేలు 1:4,17, 20.

**2. సాఫ్ట్ స్కిల్స్:** ఇతరులతో ఎలా కలసి పనిచేయాలి,




ఏ సందర్భంలో ఎవరితో, ఎలా మాట్లాడాలి, ఎలా కూర్చోవాలి, ఎలా నిలబడాలి, సందర్భాన్ని బట్టి ఎలా డ్రస్ చేసుకోవాలి, ఎలా తినాలి, సంబంధాల్ని ఎలా కాపాడుకోవాలి... ఇలాంటివన్నీ సాఫ్ట్ స్కిల్స్ క్రిందకు వస్తాయి. ఇవి అందరిలో మనకు ఒక ప్రత్యేక గుర్తింపుని తీసుకొని వచ్చి, గౌరవానికి కారణమవుతాయి. ఇవి విద్యార్థులకి, ఉద్యోగం చేసే వారికి చాలా ప్రాముఖ్యమైనవి.

**3. కంప్యూటర్ జ్ఞానం:** నీకు ఇష్టమున్నా లేకపోయినా ఈ రోజుల్లో అన్ని పోటీ పరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. కాబట్టి ఖచ్చితంగా కంప్యూటర్ నేర్చుకోవాల్సిందే. అంతేకాదు కంప్యూటర్లో మన పనుల్ని మనం చేసుకోవడం నేర్చుకోవాలి. వచ్చిన ఈమెయిల్స్‌ని ఓపెన్ చేసి చూడడం, పంపడం నేర్చుకోవాలి. మన లెటర్స్ మనం టైప్ చేసుకోవడం, మెటీరియల్స్ తయారుచేసుకోవడం, మనకు అవసరమైన వాటిని నెట్ ద్వారా బ్రౌజ్ చేసుకోవడం మొదలైనవి నేర్చుకోవాలి.

**4. చదివే సబ్జెక్టు మీద పట్టు:** నీవు చదివే సబ్జెక్ట్‌లో నీకు పట్టు ఉండాలి. విషయ స్పష్టత మరియు బలమైన పునాది వేసుకోవాలి. నీ సొంత నోట్స్ తయారు చేసుకోవాలి. మెటీరియల్‌తో పాటు టెక్స్ట్‌బుక్స్ చదవాలి. ఇలా సబ్జెక్ట్స్ మీద పట్టు ఉన్నప్పుడు, పోటీ పరీక్షలు కూడా బాగా రాయవచ్చు.

**5. విద్యలో వస్తున్న మార్పులు:** మనం ఎప్పటికప్పుడు విద్యలో వస్తున్న నూతన మార్పుల్ని గమనించి వాటిని పరిగణలోనికి తీసుకోవాలి. అవి మన కెరీర్‌ని ఎలా ప్రభావితం చేస్తాయో అర్థం చేసుకోవాలి. నూతన మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మనం అప్‌డేట్ చేసుకోవాలి లేకపోతే అవుట్‌డేట్ అయిపోతాము.

**6. పోటీతత్వం:** ఈ పోటీతత్వం అనేది ఆరోగ్యపరమైన పోటీతత్వమై ఉండాలి. దీనిని మనం కేవలం బైబిల్ నుండే అలవర్చుకోగలం. దానియేలును, తన స్నేహితుల్ని బబులోను రాజు పరీక్షించినప్పుడు వీరు పదంతల శ్రేష్ఠులని తెలియబడింది (దానియేలు 1:20). కారణం వారు దేవునిని కలిగియుండి, పోటీ పడటానికి ఇష్టపడ్డారు, కాబట్టి ఎన్నో ప్రతికూల పరిస్థితుల్లో కూడా దేవుడు వారికి విజయాన్ని ఇచ్చాడు. ప్రస్తుత పరిస్థితులు కూడా ఉద్యోగం పొందటానికి చాలా కష్టంగా ఉన్నాయి. కాంపిటేషన్

పెరిగిపోయింది. ఇలాంటి పరిస్థితులలో కూడా నీవు దేవునిమీద ఆధారపడి కష్టపడడానికి ఇష్టపడితే మన దేవుడు మనకు తప్పకుండా సహాయపడతాడు.

### మన విద్యార్థులలో కనిపిస్తున్న కొన్ని బలహీనతలు

- తమగురించి తాము తక్కువగా ఆలోచించడం.
- ఎప్పటి పని అప్పుడు చేయకుండా వాయిదా వేయడం.
- ఏకాగ్రత లేకపోవడం.
- చదువుని, పరిచర్యని బ్యాలెన్స్ చేసుకోలేక పోవడం.
- వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో ఎక్కువ సమయాన్ని వృథా చేసుకోవడం.
- పాపంలో జీవితాన్ని కొనసాగించడం.
- ఎక్కువగా నిద్ర పోవడం.
- సమయ పాలన లేకపోవడం.
- తెలియని వాటిని గ్రాడ్యుయేట్స్ అన్నవాళ్ళని అడిగి తెలుసుకోకపోవడం.
- దేవుని సార్వభౌమ అధికారాన్ని అర్థంచేసుకొని ప్రతి విషయంలో ఆయన మీద అధార పడకపోవడం..
- జీవితానికి ఒక క్రమం లేకపోవడం.
- దేవుడిచ్చిన సామర్థ్యాలను గుర్తించకపోవడం.
- గమ్యం, ప్రణాళిక, పట్టుదలతో కష్టపడి పని చేయకపోవడం.
- నెగిటివ్‌గా ఆలోచన చేయడం.

ప్రియమైన ఇయు విద్యార్థులారా! ఉద్యోగాల కొరకు ప్రయత్నం చేస్తున్నవారలారా, ఒక్కసారి ఆలోచించండి! ఇన్ని బలహీనతలు పెట్టుకొని మనం ఎలా రాణించగలం? వాటన్నింటినీ అధిగమించాలి అంటే మనం దేవుని మీద ఆధారపడాల్సిందే. అందుకే జ్ఞానియైన సొలోమోను "సోమరి చీమల యొద్దకువెళ్ళి వాటి నడతలు కనిపెట్టి జ్ఞానము తెచ్చుకొనుము" అని చెబుతున్నాడు (సామెతలు 6:6-11).

### సోమరితనం వలన కలిగే నష్టాలు

చీమల ద్వారా సోమరులను హెచ్చరిస్తున్నాడు. సోమరికి వచ్చే ఫలం దారిద్ర్యం (సామె 6:11; 10:4), వెట్టి పనులు చేస్తాడు (సామె 12:24), వేటాడినా పట్టుకోలేడు (సామె 12:27) ఆశ పడతాడు కానీ ఏమీ దొరకదు (సామె 13:4), సోమరి చేతులు పనిచేయనొల్లవు, వాని ఇచ్ఛ వానిని



చంపును (సామె 21:25), నిద్రమత్తు చింపిగుడ్డలు ధరించుకొనుటకు కారణమవును (సామె 23:21), సోమరి మార్గము ముళ్ళకంచె (సామె 15:19), గాఢ నిద్ర కలుగజేస్తుంది, పస్తులుంటాడు (సామె 19:15).

### కష్టపడడం వలన కలిగే లాభాలు

బుద్ధి కలిగి కష్టపడి శ్రద్ధగా పనిచేయడానికి వచ్చే ఫలితాలు - వేసవికాలమందు ఆహారం సిద్ధపరచుకొంటాడు. కోత కాలమందు ధాన్యం కూర్చుకొంటాడు, ఐశ్వర్యవంతుడవుతాడు, ఏలుబడి చేస్తాడు, చురుకుగా ఉంటాడు, రాజులయెదుట నిలుస్తాడు, శ్రేష్టునిగా ఉంటాడు, దేవుని నామానికి మహిమ తీసుకువస్తాడు.

### శక్తి లోపం లేకుండా కష్టపడు

కాబట్టి దేవుని పిల్లలంగా ఆలోచన చేద్దాం. పనికి కర్త దేవుడే, యేసుప్రభువు ఈ లోకంలో ఉన్నప్పుడు ఆయన కష్టపడి వడ్రంగి పనిచేసినట్లు చరిత్ర మనకు తెలియజేస్తుంది. మన రక్షణ కొరకు ఆయన ఎంతో కష్టపడ్డాడు. ఇప్పటికీ మానవుల రక్షణార్థమై ఆయన పనిచేస్తూనే ఉన్నాడు. విద్యార్థులుగా మీ జీవితం ఆశీర్వాదకరంగా ఉండాలని కోరుకుంటున్నారా? అయితే శక్తి లోపంలేకుండా నీవు పనిచేయాలని దేవుడు కోరుకొంటున్నాడు (ప్రసంగి 9 :10). ప్రత్యేకంగా కెరీర్ గైడెన్స్ డిపార్ట్‌మెంట్, ఎంతో మంది మన గ్రాడ్యుయేట్స్, వారి కుటుంబాలు మీ భవిష్యత్ కొరకు ప్రార్థన చేస్తూ ఉన్నారు. మరి కష్టపడి నీ కెరీర్ కట్టుకోవడానికి, దేవుని చిత్త ప్రకారం మంచి ఉద్యోగంలో స్థిరపడడానికి నీవు సిద్ధమేనా? నీ నిర్ణయం ఏంటి?

**- డా. ఎమ్. సాల్మన్ రాజు,** వైజాగ్

# రిస్క్ తీసుకోవాలి



సాయంత్రం 6:00 గంటలు, భీమవరంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం దగ్గర ఉన్న పార్క్‌లో కూర్చొని ఉన్న మనోహర్ మదిలో ఏవేవో ఆలోచనలు మొదలైయ్యాయి. క్రిస్మస్ సీజన్ వచ్చేసింది, ఎవరికైనా సువార్త ప్రకటిస్తే, ఏదైనా చేస్తే ఎలా ఉంటుంది... అమ్మో, ఎందుకులే రిస్క్, అయినా నా వల్ల ఏమవుతుంది... ప్రతి సంవత్సరం క్రిస్మస్ వస్తుంది పోతుంది. ఏమి చేద్దామనే ఆలోచనే రాకుండా చూసుకోవడం ఉత్తమమైన పని.

ఇంతలో ఫోన్‌కి ఏదో మెసేజ్ వచ్చినట్లు అనిపించి ఫోన్ చూస్తూ ఉండిపోయాడు. 'మనోహర్' అని ఎవరో పిలిచినట్లు అనిపించి వెనక్కి తిరిగి చూశాడు. రాజేష్ అన్న తన ఇద్దరు పిల్లల్ని పార్క్‌కి తీసుకొచ్చాడు. వాళ్ళు ఆడుకుంటున్నారు. ఇంతలో అన్న, మనోహర్ దగ్గరికి వచ్చి 'తమ్ముడూ ఎలా ఉన్నావు? అంటూ పలకరించి, క్రిస్మస్ సీజన్ వస్తుంది కదా ఏమి చేద్దాం అనుకుంటున్నావ్ అని అడిగేసరికి..దానిలోని రిస్క్ గుర్తుకు వచ్చి... అన్నా.. అది.. అంటూ ఏదో చెప్పబోయే సరికి ఇంతలో అన్న వాళ్ళ పాప శ్రేష్ట ఏడుపు వినిపించింది. తమ్ముడు మళ్ళీ కలుద్దాం అంటూ రాజేష్ అన్న వెళ్ళిపోయాడు.

హమ్మయ్య థ్యాంక్ గాడ్.. ఏ మాట వినిపించకూడదని అనుకొంటున్నానో ఆ మాట వినిపించింది. అయినా సమాధానం చెప్పకుండా తప్పించావు.

రాజేష్ అన్న ఎప్పుడూ 'ఏం చేద్దాం' అంటాడు. ఏంటో అనుకుంటూ అక్కడ నుండి మనోహర్ వెళ్ళిపోయాడు.

ఆ మరుసటి రోజు ఆదివారం ఆరాధనకు వెళ్ళడానికి సిద్ధపడుతుండగానే ఫోన్ రింగ్ అయింది. అటువైపు పాస్టర్ వినోద్ అన్న ఫోన్లో "హలో తమ్ముడూ, ఆరాధనకి టైమ్‌కి వచ్చేయ్, ఆరాధన మానకు, అభిషేకన్న స్పీకర్‌గా వస్తున్నారు" అంటూ మనోహర్ సరే అనే లోపే ఫోన్ కట్ అయింది.

గత వారం ఆరాధనకు వెళ్ళకపోయేసరికి అన్నకి డౌట్ వచ్చినట్లుంది. ఫర్వావాలేదులే, లేట్‌గా వెళ్ళినా ఏమీ కాదులే. టైమ్‌కి వెళ్ళాలా? ఏంటి అనుకుంటూ లేట్ చేయసాగాడు. ఆరాధన మానేస్తే తప్పుగానీ లేట్‌గా వెళితే ఏమీ కాదులే, లైట్ తీసుకో అని తనలో తను అనుకొంటూ ఆలస్యంగానే వెళ్ళాడు.

మనోహర్ చర్చ్‌కి వెళ్ళేసరికి ప్రసంగం ప్రారంభమై 'ఎక్కలేనంత ఎత్తైనకొండపైకి ఎక్కించు' అని దావీదు గురించి వివరిస్తున్నాడు అభిషేక్ అన్న. దావీదు దేవుని నామానికి అవమానం వస్తుందని తెలిసి వెంటనే రిస్క్ తీసుకొని గొల్యాతుతో యుద్ధంలో గెలిచి దేవుని నామానికి మహిమ తీసుకొచ్చాడు అంటూ సాగిపోతున్న ప్రసంగంలో 'రిస్క్' అనే మాట మనోహర్ చెవిలో గిర్రున తిరిగింది.

మనోహర్ దావీదు గురించి ఆలోచిస్తుండగానే అభిషేకన్న విలియం కేరి గురించి చెబుతూ "దేవుని కోసం గొప్ప కార్యాలు తలపెట్టు దేవుని దగ్గర నుండి గొప్ప కార్యాలు ఆశించు" అంటూ ప్రసంగం కొనసాగిస్తున్నాడు. మరలా మనోహర్ మదిలో విలియం కేరి 'రిస్క్' తీసుకొని ఇండియాకు వచ్చి ఇంత గొప్ప సేవ చేసి దేశానికి దీవెనగా మారాడా? అలా అయితే నేను కూడా 'రిస్క్' తీసుకోవాలా? నావల్ల కాదులే, మనకెందుకు .. వచ్చామా, విన్నామా, వెళ్ళామా అంటూ ఆరాధన అవ్వగానే రూమ్‌కి వచ్చేశాడు.

మనోహర్ మదినిండా 'రిస్క్' తీసుకోవాలనే మాటలే గుర్తుకు వస్తున్నా చాలా బలవంతంగా వాటిని అణచివేస్తున్నాడు. ఆ రాత్రి సరిగా నిద్ర కూడా పట్టలేదు. తెల్లవారకముందే మెలకువ వచ్చింది.

క్వైట్‌టైమ్ చేసుకొందామని బైబిల్, నోట్స్ తెచ్చుకొని కూర్చున్నాక, క్రిస్మస్ సీజన్ కదా రోజూ చదివే వాక్యభాగం కాకుండా లూకా సువార్త చదువుదాం అనుకొని లూకా సువార్త 1వ అధ్యాయం చదవడం ప్రారంభించాడు. అలా చదువుతుండగా 1:38 దగ్గర ఆగిపోయాడు. "ప్రభువు దాసురాలను నీ మాట చొప్పున జరుగును గాక...". ఆ మాట దగ్గర తన నోట్స్‌లో తల్లి అయిన మరియ యేసుక్రీస్తు ప్రభువును ఈ లోకానికి అందించడానికి 'రిస్క్' తీసుకొన్నది అని రాసుకొన్నాడు.

మనోహర్ వాక్యం చదువుతుండగా దేవుడు వెలిగింపు ఇవ్వడం ప్రారంభించాడు. తన నోట్స్‌లో వాటిని ఇలా రాసుకొన్నాడు. "అననుకూల పరిస్థితుల్లో రిస్క్ తీసుకునేవారు కావాలి. అననుకూల పరిస్థితులే గొప్ప పరిచర్యకు పునాది". అలా తన నోట్స్‌లో రాసుకుంటూ కళ్ళ వెంట కారుతున్న కన్నీటిని తుడుచుకొంటూ "నేను నీ దాసుడను ప్రభువా" అంటూ దేవునికి అప్పగించుకొన్నాడు. మనస్ఫూర్తిగా క్రిస్మస్ సీజన్‌లో ఏదైనా చేయాలని మనసులో చిన్న ప్రార్థన చేసుకొన్నాడు. కానీ ఏం చేయాలి? ఎలా చేయాలి? అనే ప్రశ్నలు ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే వెంటనే రాజేష్ అన్న గుర్తుకు వచ్చాడు.

ఆ సాయంత్రమే అన్న దగ్గరికి వెళ్ళాలని నిర్ణయించుకొని కాలేజీకి వెళ్ళాడు. మధ్యాహ్నమే రాజేష్ అన్నకి ఫోన్ చేసి ఇంటికి వస్తానని చెప్పాడు. కాలేజీ అయిపోయిన వెంటనే రూమ్‌కి వెళ్ళి ఫ్రెష్ అయ్యి అన్న దగ్గరికి వెళ్ళాడు. అన్న వాళ్ళ పిల్లలు హోంవర్క్ చేసుకొంటున్నారు. అక్క కిచెన్‌లో ఉంది. అన్న కూరగాయలు కోసం బయటికి వెళ్ళారని అక్క చెప్పింది. కొద్దిసేపటికి చక్కటి చిరునవ్వుతో చిక్కటి టీ చేతికి వచ్చింది. వాహ్‌తాజ్ అంటూ టీని ఆస్వాదిస్తూ తాగడం ముగించే లోపు రాజేష్ అన్న బండి సౌండ్ వినిపించింది. హాయ్ మనోహర్, జస్ట్ ఎ మినిట్ అంటూ కూరగాయలు అక్కకు అప్పగించి వచ్చి మనోహర్ పక్కన కూర్చొన్నాడు. మనోహర్ మాట్లాడుతూ, "అన్న క్రిస్మస్ సీజన్ వస్తుంది కదా ఏమైనా చేద్దామని అనిపిస్తుంది కానీ ఏం చేయాలో, ఎలా చేయాలో, అర్థం కావడం లేదు అందుకే మీ దగ్గరికి వచ్చాను.

ఇంతలో అక్క వచ్చి "మనోహర్ రాత్రికి భోజనం ఇక్కడే చేసి వెళ్ళు" అంటూ ఆప్యాయంగా చెప్పింది. మనోహర్‌కి మనసులో పట్టరాని సంతోషం. రూమ్‌లో వండే కూరలు తినలేక చచ్చిపోతున్నాను, ఈరోజు అక్క చేతి వంట తినొచ్చని. రాజేష్ అన్న, తమ్ముడూ పార్క్‌లో నిన్ను కలిసినప్పటి నుంచి నీ గురించే ఆలోచిస్తూ, ప్రార్థన చేస్తున్నాను. అయితే దేవుడు నాకు ఇచ్చిన ఆలోచన ఏంటంటే మీ కాలేజీలోని మీ యాజమాన్యం అనుమతితో క్రిస్మస్ ప్రోగ్రాం పెడితే ఎలా ఉంటుంది? ఆ మాటకి మనోహర్‌కి అంత ఫ్యాన్ గాల్లో కూడా చెమటలు పడుతున్నాయి. రాజేష్ అన్న చెప్పిన మాటలకు అక్కడి నుండి పారిపోతే బాగుండనిపించింది. అంతలో రాజేష్ అన్న "తమ్ముడూ నాకు తెలుసు మీ కాలేజీలో క్రిస్మస్ ప్రోగ్రాం పెట్టడం అంత సులువు కాదు. ఎందుకంటే గత 20 సంవత్సరాలుగా అక్కడ క్రిస్మస్ ప్రోగ్రాం జరగలేదు. ఇతర విశ్వాసాలవాళ్ళు ఎక్కువగా ఉన్నారు. క్రైస్తవులను చాలా చిన్నచూపు చూస్తున్నారు. పైగా ఇంజనీరింగ్ కాలేజ్. నీవు తప్ప ఇయు స్టూడెంట్స్ అక్కడ ఎవరూ లేరు. దాదాపు 8,000 మంది విద్యార్థులు ఉన్న కాలేజీకి సువార్తను అందించే గొప్ప అవకాశం. నువ్వు ఫైనల్ ఇయర్ తర్వాత నువ్వు అక్కడ ఉండవు. ఆలోచించు అంటూ" అన్నకి ఫోన్ రాగానే ఫోన్ లో మాట్లాడితే పక్కకు వెళ్ళాడు.

మనోహర్‌కి అర్థమవుతుంది. అన్నీ ప్రతికూల పరిస్థితులే. తన డిపార్ట్మెంట్లో ఫ్యాకల్టీ అంతా ఇతర విశ్వాసులే. అంత ఈజీగా అవుతుందా? రిస్క్ కదా. అసలే ఫైనల్ ఇయర్, ప్రాజెక్ట్ మార్కులు, పైగా క్యాంపస్ ఇంటర్వ్యూలు, చాలా పెద్ద రిస్క్ చేయాలి. ఇంకొక నాలుగు నెలలు ఆగితే ఇంజనీరింగ్ పూర్తి చేసుకొని వెళ్ళిపోతాను. నాకెందుకు ఈ తిప్పలు నావల్ల కాదులే అనుకుంటూ రాజేష్ అన్నకి నో చెబుదామని మనసులో గట్టిగా నిర్ణయించుకొన్నాడు.

కాసేపటికి అక్క ఫ్యామిలీ ప్రేయర్ చేసుకొని భోజనం చేద్దామని అన్నతో చెప్పింది. మనోహర్‌కి మనసు కొంచెం కష్టంగానే అనిపిస్తుంది అయినా సరే ఫ్యామిలీ ప్రేయర్‌లో వారితో పాటు కూర్చొన్నాడు. పాటలు పాడిన తర్వాత వాక్యం చదువుకొందాం అని నిర్గమకాండం ఒకటవ అధ్యాయం అన్న చదువగా, అక్క కొంచెం వివరిస్తాను అంటూ కొన్ని మాటలు చెబుతూ మధ్యలో "మోషే తల్లి రిస్క్ తీసుకొంది. మోషే విషయం ఏమాత్రం తెలిసినా

ఐగుప్తు సైనికులు మోషేను, అతని తల్లిదండ్రులను చంపేస్తారని తెలిసి కూడా రిస్క్ తీసుకొని దాచింది. దాని వలన ఇశ్రాయేలీయులకు గొప్ప నాయకుడిని అందించారు. మనం కూడా దేవుని నామ మహిమ కోసం రిస్క్ తీసుకోవాలి అంటూ అక్క ముగించింది. అంతలో అన్న, మనోహర్ ప్రార్థన చెయ్యి అనేసరికి పొడిపొడిగానే చేసి ప్రార్థన ముగించాడు. తర్వాత అక్క చక్కటి భోజనం పెట్టింది. అందరికీ గుడ్ నైట్ చెప్పి అక్కడి నుండి రూమ్‌కి వెళ్ళి పోయాడు మనోహర్.

రూమ్‌కి వెళ్ళాడే కానీ మనసు మనసులో లేదు. దేవుడు పదే పదే రిస్క్ గురించి మాట్లాడుతున్నా ఏదో తెలియని భయం. "గొప్ప పరిచర్యకి పరిస్థితులు ప్రతికూలంగానే ఉంటాయి" అనే మాట గుండెను గుచ్చుతుంది. దేవుడు తన ద్వారా తన కాలేజీలో ఏదో గొప్ప పని చేయబోతున్నాడు. అయితే తనే తప్పించుకోవడానికి సకల ప్రయత్నాలు చేస్తున్నట్లు అర్థమై ఏడ్వడం ప్రారంభించాడు. దేవా, ఏదో ఒకటి చేస్తాను ధైర్యం ఇవ్వు. రిస్క్ తీసుకొంటాను. తోడుగా ఉండు అంటూ నిర్ణయాత్మకమైన ప్రార్థన చేసి పండుకొన్నాడు.

మరుసటి రోజు సాయంత్రం రాజేష్ అన్నను కాలేజ్ దగ్గరకు రమ్మని చెప్పాడు మనోహర్. ఇద్దరూ కలిసి కొద్దిసేపు కాలేజీ గురించి ప్రార్థన చేసి ఏం చేద్దాం? ఎలా చేద్దాం? అంటూ చర్చించుకోసాగారు. తర్వాత రాజేష్ అన్న ఇలా చెప్పాడు.

1. ఇయు ప్రార్థన సహాయం కోరదాం.
2. నీవే ప్రిన్సిపాల్‌కి చక్కగా లెటర్ రాసి పర్మిషన్ అడుగు.
3. పర్మిషన్ వస్తుంది. దేవుడు సహాయం చేస్తాడు. అప్పుడు మీ కాలేజీలో ఉన్న క్రైస్తవ విశ్వాసులైన సార్స్,మేడమ్స్‌తో మాట్లాడి వారి సపోర్ట్ అడుగు.
4. ఆ తర్వాత నీకు తెలిసిన క్రైస్తవ విద్యార్థులతో విషయాలు చెప్పి, వారితో కలిసి పనిచేస్తే ప్రోగ్రాం పెట్టగలం.
5. ఫైనాన్షియల్ సపోర్ట్, అరేంజ్మెంట్స్, స్పీకర్ గురించి ఇఐియఫ్ వాళ్ళ సపోర్ట్ తీసుకొందాం.

వారం రోజులు మనిద్దరం కలిసి ప్రార్థన చేసిన తర్వాత మనం అనుకున్నవి స్టార్ట్ చేద్దాం అంటూ అన్న ముగించాడు.

వారం రోజులు ప్రార్థన చేసిన తర్వాత మనోహర్ ప్రిన్సిపాల్ పర్మిషన్ కోసం లెటర్ ఇచ్చే రోజు రానే వచ్చింది. చాలా రిస్క్ అనిపిస్తున్నప్పటికీ దేవుడు సహాయం చేస్తాడనే ధైర్యంతో ముందుకు వెళ్ళాడు. లెటర్ తీసుకొని ప్రిన్సిపల్ దగ్గరికి వెళ్ళి ఇచ్చాడు. ప్రిన్సిపల్ లెటర్ చదివి మన కాలేజీలో ఎప్పుడూ ఇలాంటివి లేవు. అయినా స్టూడెంట్స్ ప్రోగ్రాం చేసుకోవడానికి, అది క్యాంపస్‌లోని గ్రౌండ్లో చేసుకోవడానికి ఎలా పర్మిషన్ ఇస్తాము? అంటూ కాసేపాగి సరేలే, ఎవరైనా ఫ్యాకల్టీని తీసుకొని రా ఆయనతో మాట్లాడి నిర్ణయం చెబుతాను అని మనోహర్‌ని బయటికి పంపించాడు. మనోహర్ కాలేజీలో తెలిసిన క్రైస్తవ ఫ్యాకల్టీతో మాట్లాడుతున్నాడు. ఏ ఫ్యాకల్టీ కూడా నేను ఉన్నాను అని చెప్పి ముందుకు రావడం లేదు. చాలా నిరాశతో ప్రభువా ఏం చేయమంటావు ప్రతి ఫ్యాకల్టీ భయపడుతున్నారు అంటూ చివరి ప్రయత్నంగా సుధీర్ సార్ దగ్గరికి వెళ్ళాడు. సుధీర్ సార్ ఒప్పుకోవడం, ప్రిన్సిపల్ సార్ కూడా ఒప్పుకోవడం, కాలేజీ ఛైర్మన్ రావడం అంతా క్షణాల్లో జరిగిపోతుంటే మనోహర్‌కి ఏమీ అర్థం కావడం లేదు. ఆశ్చర్యంగా 10 నిమిషాల్లో పర్మిషన్ వచ్చేసింది. మనోహర్ దేవుని నమ్మకత్వాన్ని చూసి స్తుతించకుండా ఉండలేకపోయాడు. 20 సంవత్సరాల కాలేజీ చరిత్రలో ఇదే మొదటిసారి. మిగతా పనులు చక్కగా చకచగా జరిగిపోయాయి. అభిషేకన్న స్పీకర్‌గా వచ్చాడు. దాదాపుగా 1500 మంది స్టూడెంట్స్ వచ్చి చక్కగా సువార్త విని చాలామంది వాక్యానికి స్పందించి, రక్షించబడ్డారు.

క్రిస్మస్ ప్రోగ్రాం అంతా అయిపోయిన తర్వాత గ్రాడ్యుయేట్స్ మనోహర్‌ని అభినందించారు. మనోహర్‌కి జరిగినదంతా ఒక కలలా ఉంది. "దేవా నన్నేనా మీరు వాడుకొంది, నేను చూపించిన ఈ చిన్న రిస్క్ ఎంత గొప్ప పరిచర్యకు పునాది వేసింది, థాంక్యూ దేవా" అంటూ నిద్రలోకి జారుకున్నాడు.

ప్రియ తమ్ముడూ, చెల్లీ మరి మీ కాలేజీ పరిస్థితి ఏంటి? సువార్తను అందించడానికి క్రిస్మస్ సీజన్ మంచి అవకాశం. ఈ అవకాశం మరలా సంవత్సరం తర్వాతనే. రిస్క్ తీసుకొంటావా? సువార్తను అందిస్తావా? మార్పుకు నాంది పలుకుతావా?

**– యం.గాలెయ్య,** భీమవరం

# నీవు ప్రేమగలవాడివే!



అర్ధరాత్రి నీ ఇంటి తలుపులు తట్టడానికి
ఎవరైనా వెనకాడడం లేదంటే
నీవు ప్రేమగలవాడివే!

ఫలాన వారి రాక వలన
నీ ప్రైవసీని కోల్పోతున్నావంటే
నీవు ప్రేమగలవాడివే!

వేరేవారి అవసరాల నిమిత్తం
నీ ధననిధి కరిగిపోతుందంటే
నీవు ప్రేమగలవాడివే!

నీ కోసమని తెచ్చుకొన్న సరుకులు
వేరేవారి కోసం త్వరగా అయిపోతున్నాయంటే
నీవు ప్రేమగలవాడివే!

చక్కగా ప్రణాళిక వేసుకొన్న నీ రోజువారి కార్యక్రమాలు
అస్తవ్యస్తమవుతున్నాయంటే
నీవు ప్రేమగలవాడివే!

నిన్ను బాగా విసిగిస్తున్నా
నీవు బాధపడడం లేదంటే
నీవు ప్రేమగలవాడివే!

ఇయు వాళ్ళు, సంఘస్తులు మాత్రమే కాకుండా
నీ బంధువులు కూడా నీ ఇంటికి రాగలుగుతున్నారంటే
నీవు ప్రేమగలవాడివే!

రాత్రనక పగలనక
ఆతిథ్యం ఇవ్వాల్సి వస్తుందంటే
నీవు ప్రేమగలవాడివే!

నీకు ఇష్టం లేని వారిని
నువ్వేముందు పలకరిస్తున్నావంటే
నీవు ప్రేమగలవాడివే!

సమయమనక, అసమయమనక
సువార్త నిమిత్తం శ్రమపడుతున్నావంటే
నీవు ప్రేమగలవాడివే!

ఎందుకంటే...

నా ప్రభువు ఎక్కడ ఉన్నాడా అని జనాలు వెతుక్కొంటూ వచ్చేవారు
నా ప్రభువు పొద్దుగుంకే వరకు బోధించారు, స్వస్థపరచారు
నా ప్రభువు ఇస్కరియోతు యూదాను శిష్యునిగా ఉంచుకొన్నారు
నా ప్రభువు తన్ను హింసించేవారికోసం ప్రార్థించారు
నా ప్రభువు తన తమ్ముడిని శిష్యునిగా చేసుకొన్నారు
నా ప్రభువు తన తల్లిబాధ్యత శిష్యునికి అప్పగించాడు
నా ప్రభువు ఇతరుల కోసం పానార్పణంగా పోయబడ్డాడు

– స్వరూపిణి, వైజాగ్

# నేను కష్టాల్ని...



క్రీస్తులో నీ పునాదుల్ని బహిర్గతం చేస్తూ
నీ స్థిరత్వానికి కొలమానిక అవుతాను
నీ పరిస్థితులకు నే జతకలిసినప్పుడు
నీ అసలు స్వరూపాన్ని బయట పెట్టే నిజాన్ని అవుతాను
కొన్నిసార్లు నీ వ్యక్తిత్వాన్ని సవాలు చేస్తూ
మరికొన్నిసార్లు నీ మానసిక స్థైర్యాన్ని త్రాసులో వేసి తూస్తుంటాను!
పాడైన నీ పునాదుల్ని మరమ్మత్తు చేసుకోవడానికి
ఓ మంచి అవకాశాల్ని కల్పిస్తుంటాను!
క్రైస్తవ జీవితానికి నేనెప్పుడూ అతీతం కాదండోయ్!!!!
నీ విశ్వాసాన్ని పరీక్షిస్తూ నిన్ను
స్వచ్ఛమైన బంగారంలా మార్చడానికే నేను ఇలా వచ్చి అలా వెళ్ళిపోతుంటాను
ఒకటి గుర్తుపెట్టుకోండి!

నన్ను రుచి చూసినవారే
సహించడంలో పెంపొందినవారై
ఇతరుల కష్టాల్ని
అర్థంచేసుకొనే ఓర్పు
వారిని ఓదార్చే నేర్పు
మీకలవడతాయి
చూశారా!!
కష్టాల కొలిమిలోంచి నిన్ను విజేతగా చేసి
క్రీస్తులో నీ విలువల్ని పెంచి
కలలా వచ్చి కరిగిపోయే నన్ను చూసి
నువ్వు ఎందుకు దిగ్భ్రాంతి చెందుతావో ఏమో మరి!
తెలీదు??

– కె. స్వాతి, బాపట్ల

# క్షమాపణ

## ఒక ఆధ్యాత్మిక సామర్థ్యం




'నేను అతనిని క్షమించను', "క్షమిస్తాను గాని అతను చేసిన దాన్ని నేను ఎప్పుడూ మరచిపోను" అనే మాటల్ని మనం తరుచుగా వింటుంటాం. మనలో చాలామందికి ప్రతిరోజు గాయపరిచే సంఘటనలు, అనుభవాలు ఎదురవుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇవి మన క్షమాగుణాన్ని పరీక్షిస్తాయి.

క్షమాగుణం లేదా క్షమించడం అనేది అత్యంత ప్రాముఖ్యమైన భావోద్వేగ, మానసిక లక్షణాలలో ఒకటి. కోపం, పగ, విచారం, నొచ్చుకోవడం, శత్రుత్వం, వంటి భావోద్వేగాలు క్షమించడం ద్వారా సమసిపోతాయి. సమాధానపడడం, తగ్గిఉండడం, పశ్చాత్తాపడడం, పరిహారం చేయడం, విమోచించడం వంటివి ఇందులో ఇమిడి ఉన్నాయి.

### దేవుని సహాయాన్ని కోరుకోవాలి

క్షమించడం, క్షమాపణ కోరడం ఒక జ్ఞానయుక్తమైన నిర్ణయం మాత్రమే కాదు, అది ఒక ఆధ్యాత్మిక సామర్థ్యం. మత్తయి సువార్తలో ప్రభువు చెప్పిన క్షమించని సేవకుని ఉపమానంలో క్షమించడం అంటే ఏంటో తెలియజేయబడింది. "ఆ సమయమున పేతురు ఆయన వద్దకు వచ్చి - ప్రభువా, నా సహోదరుడు నా యెడల తప్పిదము చేసిన యెడల నేనెన్ని మారులు అతని క్షమింపవలెను? ఏడు మారులు మట్టుకా? అని అడిగెను. అందుకు యేసు అతనితో ఇట్లనెను - ఏడుమారులు మట్టుకే కాదు, డెబ్బది ఏళ్ళమారుల మట్టుకని నీతో చెప్పుచున్నాను' (మత్తయి 18:21). ఈ మాటలను బట్టి చూస్తే క్షమాపణకు అంతములేదు అని మనకు అర్థమౌతుంది. ఇది చాలా శక్తివంతమైన వర్తమానము. మనలో చాలామందికి ఇది అసాధ్యమనిపిస్తుంది. కాని ఇది మన జీవితంలో తప్పనిసరిగా కనిపించాల్సిన లక్షణం. ఇంతటి క్షమాగుణానికి మనం ఎదగాలంటే, శక్తి, సహనం కోసం మనం ప్రార్థించాలి. మార్కు 11:25లో క్రీస్తు ఇలా చెప్పారు: మీకు ఒకనిమీద విరోధ మేమైనను కలిగియున్నయెడల, మీరు నిలవబడి ప్రార్థన చేయునప్పుడెల్లను వాని క్షమించుడి" లూకా 6:36-37లో ఇలా చెప్పారు: "కాబట్టి మీ తండ్రి కనికరముగలవాడైయున్నట్టు మీరును కనికరము గలవారైయుండుడి... క్షమించుడి, అప్పుడు మీరు క్షమించబడుదురు". కీర్తన 130:3-4 ఇలా రాయబడి ఉన్నది: యెహోవా, నీవు దోషములను కనిపెట్టి చూచినయెడల, ప్రభువా, ఎవడు నిలువగలడు? అయినను జనులు నీయందు భయభక్తులు నిలుపునట్లు నీయొద్ద క్షమాపణ దొరుకును". 2 కొరింథీ 5:14-21లో సమధాన పరిచర్యను గూర్చి పౌలు రాశాడు. దేవుడు ఈ లోకాన్ని క్రీస్తు ద్వారా సమాధానపరచుకొన్నాడు. మనుష్యుల పాపములను వారిపై ఆయన మోపలేదు. క్రీస్తు చూపిన ప్రవర్తన, మాదిరి మనలో కనిపించాలని, ఇతరులను మనం క్షమించాలని ఈ వాక్యభాగాలు మనకు తెలియజేస్తున్నాయి.

మత్తయి 18వ అధ్యాయంలో చెప్పిన విధంగా ఇతరుల్ని క్షమించడానికి, ఇతరులను క్షమాపణ కోరడానికి దేవుడు మనల్ని పిలిచాడు. ప్రభువు నేర్పిన ప్రార్థనలోని విషయాలను కూడా మనం మరచిపోకూడదు, మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములను క్షమించుము" (మత్తయి 6:12).

ఒకసారి ఇద్దరు మాజీ సైనికులు వియత్నాం యుద్ధ జ్ఞాపక చిహ్నాన్ని సందర్శించారు. వారిలో ఒకరు ఇలా ప్రశ్నించాడు, "యుద్ధ ఖైదీగా నిన్ను బంధించిన వారిని నీవు క్షమించావా?" "లేదు. నేను వారిని ఎన్నడూ క్షమించను" అని బదులిచ్చాడు రెండవ వ్యక్తి. "అయితే నువ్వు ఇంకా జైల్లోనే ఉన్నావన్నమాట" అని అన్నాడు మొదటి వ్యక్తి. ఈ మాట ఆ రెండవ వ్యక్తి దృక్పథంలో మార్పును తీసుకొచ్చింది. "నేను బలయ్యాను, నాకు అన్యాయం జరిగింది" అని భావించినంత కాలం మనం ఇతరుల్ని క్షమించలేము. క్షమాపణ గొప్ప స్వస్థతనిస్తుంది, కోపాన్ని తగ్గిస్తుంది, మనశ్శాంతిని ఇస్తుంది. సంబంధాలను పునరుద్ధరిస్తుంది.

– ఎమ్మెట్ ఐ. ఆల్డ్రిచ్

కవిత

# సర్వోన్నతుడు సశరీరుడయ్యే



ప్రవక్త యెషయా - ప్రవచించె
కన్యక గర్భవతియై - కుమారుని కనును
తన ప్రజలను - తమ పాపముల నుండి
విడిపించె - విమోచన కర్త
మనకు శిశువు - పుట్టెను
ఆలోచనకర్త - అరుదెంచె

నిత్యుడగు తండ్రి - నీ కొరకు దిగివచ్చె
దేవునికిని - మానవాళికిని
మధ్యవర్తి - ఒక్కడే
ఆయనే - యేసుక్రీస్తను నరుడు
సృష్టికర్త - శరీరమును ధరించె

ఆదాము దోషమునకు - అడ్డుపడియె
రక్తమాంసములను - ధరించె రక్షకుడు
గాబ్రియేలు దూత - గళమెత్తి చాటిన
ఆనవాళ్ళను గురించి - ఆలోచించుడి

ఇదిగో ... ఆనందం
ఇదిగో ... బెత్లెహేం
ఇదిగో ... దావీదు పట్టణం
ఇదిగో ... యెరూషలేం
ఇదిలో ... హోలీల్యాండ్
ఇదిగో ... హోలీ నేషన్
ఇదిగో ... హోలీ బైబిల్
ఇదిగో ... నక్షత్రం

చరిత్రను విభజించిన - చరిత్రకారుడు
క్రీస్తుశకం - 2023
క్యాలెండరే - ఖచ్చితమైన ఋజువు

ఇశ్రాయేలుకు - మహిమ
అన్యజనులకు - వెలుగు
సుమియోను యొక్క - సునాదగీతం
సూటిగా - వర్ణించె

మృత్యుభీతి - తొలగించు
ఆత్మశుద్ధి - కలిగించు
బెత్లెహేం నుండి - 'క్రిస్మస్' సవ్వడి
భూదిగంతాల వరకు - వ్యాపించుచుండె

యూదా ప్రజలు -ఎదురు చూచిన 'మెస్సీయ
మానవునిగా - మహినుద్భవించె
యూదుల రాజుగా - పుట్టిన వాడెక్కడ?
జ్ఞానులు - జ్ఞానముతో అడిగిన ప్రశ్న ఇదే
శిశువును జూచి - సాగిలపడుటకు
జ్ఞానుల బృందం - అరుదెంచే

శరీరమును ధరించిన - సృష్టికర్తను
తెలుసుకుంటే - తరించున్ నీ బ్రతుకు
ప్రాయశ్చిత్తం - జరిగించుటకు
ప్రభువు - జన్మించె
క్రీస్తును - తెలుసుకొనుటయే
నిజమైన - 'క్రిస్మస్'

సర్వోన్నతమైన స్థలములలో - దేవునికి మహిమ
ఆయనకిష్టులైన ప్రజలకు భూమి మీద సమాధానం
సమాధాన అధిపతి - మనలను తన
సమాధానముతో - నింపును గాక ....

- యస్.సి.హెచ్. ఎలీషా, నర్సరావుపేట

## విద్యార్థుల రచనలకు ఆహ్వానం

దేవుని కొరకు రాయాలనే ఆసక్తిగల సీనియర్ విద్యార్థులకు విద్యార్థిజ్వాల ఆహ్వానం పలుకుతుంది. కళాశాలలో మీ అనుభవాలు, ట్రెండ్స్, ఆర్టికల్స్, సాక్ష్యాలు, కవితలు, కార్టూన్స్ మొదలైనవి ప్రతి నెల 10వ తేదీలోపు మా ఇమెయిల్ editorvj@gmail.com కు పంపండి. ఈ చక్కటి అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకొండి.

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-11-2023**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# ఈయన ఎవరో?

అల్లరి చేసే పిల్లలను
గద్దిస్తే గమ్మునున్నట్టు
అల్లకల్లోలమై
అలలతో ఎగిసిపడే సముద్రం
తను గద్దించగానే
అలా నిమ్మళమైందే!
అబ్బురంగా ప్రకృతి లోబడుతుందే!
ఈయన ఎవరో...?

ఎండకు ఎండిన గడ్డి
ఏటి నీరు తాకగానే
పచ్చబడినట్టు...
రోగమేదైనా
రోదనెంతైనా
తన చేయి తాకగానే
చిత్తగించి చిత్తైపోతుందే!
చిత్రంగా ప్రతి రుగ్మతా
ప్రణమిల్లుతుందే!
ఈయన ఎవరో...?

ఏ రంగూ రుచి లేని నీళ్ళను
రుచికరమైన ద్రాక్షారసంగా మార్చాడే
పాడెమీద శవాన్ని బతికించి
ఏడ్చేవారి గుండెల్లో
ఎంతో సంతోషం నింపాడే
ఎన్ని రోజులు చెప్పుకొన్నా
తరగని అద్భుతాలు
ఎన్నెన్నో చేశాడే...
ఈయన ఎవరో...?

తన పలుకుల్లో అయినా
తప్పు పట్టుకోవాలనుకొన్న
వాళ్ళ నోళ్ళే మూయించాడే
మనసులో మాట
పెదవి దాటక ముందే
అంతరంగమంతా ఆయనకు
తెలిసిపోతుందే...
ఈయన ఎవరో...?

నక్షత్ర కాంతులు
జ్ఞానుల కానుకలు
దూతల గానాలు
గొల్లల పాటలు
ఆనాడు ఇచ్చిన సందేశమిదే!
ఆయనే పరలోకం నుండి
పశుశాలకు దిగివచ్చిన పరిశుద్ధుడు!
చీకట్లో కూర్చొన్న వారికి గొప్ప వెలుగు
మరణచ్ఛాయలో ఉన్నవారికి
నిత్యజీవం ఆయనే

అవును...
ఆయన సార్వభౌముడు
మరణం గెలిచిన సజీవుడు
యేసు నామధేయుడు
క్రీస్తే స్తోత్రార్హుడు
ఆయన మాట స్వస్థతా సలిలం
ఆయన స్పర్శ సత్వర సరాగం
ఆయన చూపు సమగ్ర సాంత్వనం!

– గొంగటి మేరిజాయ్, ఆదోని